గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# అక్టోబర్ 2015 కథలు




మా మామగారి పూజ అయినట్లుంది, పూజగదిలోంచి గంట వినిపిస్తోంది. పిల్లలు మెల్లిగా తాతగారి పక్కన చేరారు. ప్రసాదం భక్తులు! నేను, మా అత్తగారు వంటింట్లో పని చేసుకుంటూ పని మనిషి కోసం చూస్తున్నాము. రోజూ పొద్దున్నే ఆరు గంటలకు వచ్చే మా పనిమనిషి లక్ష్మి ఏడవుతున్నా ఇంకా రాలేదు. ఇంక రాదేమో. ఈ నెలలో ఇది నాలుగో సారి మానేయటం. పనిమనిషి రాకపోతే ఇంక ఆ రోజు నా అవస్త ఇంతా అంతా కాదు. నాలాంటి వాళ్లకి పనివాళ్లు, పాలవాళ్లే కదా కులదైవాలు!

పనిమనిషిని తిట్టుకుంటూ హడావుడిగా పని చేసుకుని ఆఫీసుకి తయారు అయ్యేటప్పటికి ఎనిమిదిన్నర. టిఫిన్ తినే టైము లేదు. ఎలాగైనా ఈవేళ లేటే అనుకుంటూ బయలుదేరుతుంటే మా అత్తగారు హర్లిక్స్ కలిపి ఇచ్చారు. అందుకేనేమో మా అమ్మమ్మ అనేది "ఎప్పుడైనా ఓ మాట అన్నా, అవసరం వచ్చినప్పుడు విస్తట్లో గుప్పెడు అన్నం పెట్టడానికి ఆడపిల్లకి ఇంట్లో అత్తగారు ఉండద్దుటే" అని.

మా అమ్మమ్మ "ఓ మాట అన్నా" అన్నది కాని, నిజానికి మా అత్తగారు ఏనాడు నన్ను అన్నది లేదు – నేను పడింది లేదు. మా మామగారైతే, "మాకు పుట్టిన వాళ్లు ఇద్దరు, మా ఇంటికి వచ్చిన వాళ్లు ఇద్దరు, మాకు నలుగురు పిల్లలు" అంటారు. మా అత్తగారికి, మామగారికి బంధుప్రీతి ఎక్కువ. ఎప్పుడూ బంధువుల, స్నేహితుల రాక పోకలతో, మా ఇల్లు పెళ్లివారిల్లులాగా కళకళ్లాడుతూ ఉంటుంది.

ఆఫీసులోకి అడుగు పెట్టానో లేదో రమేష్ "అరుణ్ గారు మీ కోసం రెండు సార్లు ఫోన్ చేసారు" అన్నాడు. అరుణ్ మా రీజనల్

మేనేజర్. అదేంటో నేను లేటుగా వచ్చినప్పుడే ఫోన్ చేస్తాడు. టైముకి వచ్చినప్పుడు ఏ ఫోనూ రాదు. నేను లేటుగా వచ్చినట్టు ఎలా తెలుస్తుందో! పాతాళ భైరవి సినిమాలోలా ఆయన దగ్గర దుర్భిణి ఏదన్నా ఉన్నదేమో! ఆలస్యంగా వచ్చిన ప్రతిసారీ ఏదో గిల్టీ ఫీలింగ్. ఆ టైములో ఏదన్నా ఫోన్ వస్తేనో, కస్టమర్ వెయిట్ చేస్తూ ఉంటేనో మరీను. ఇదే మాట వారితో అంటే, "ఆ మాత్రం సెన్సిటివిటీ కూడా లేకపోతే ఇక ఉద్యోగం మానేయటం బెటర్" అంటారు.

మధ్యాహ్నం లంచ్ కి బయలుదేరుతుంటే మా వారి ఫోను. "బాబాయికి పొద్దున్న హార్టటాక్ వచ్చిందిట. అక్కడే హాస్పిటల్ లో చేర్పించారు. ప్రస్తుతానికి ఫరవాలేదు. అమ్మ, నాన్న వెళతామంటే రాత్రి తొమ్మిదిన్నర బస్సుకి టికెట్ కొన్నాను. సాయంకాలం నిన్ను పికప్ చేసుకుంటాను. లేటు చేయకు" అని. సరేనన్నాను.

మా మామగారు, ఆయన తమ్ముడు ఒకరంటే ఒకరు చాలా ఆపేక్షగా ఉంటారు, డెబ్బై యేళ్లు దాటినా కూడా. రోజుకి కనీసం ఒక సారి ఫోనులో మాట్లాడుకోకపోతే ఇద్దరికీ తోచదు. ఇంక కలుస్తే ఆ కబుర్లకి అంతే ఉండదు. మా మామగారికి పెద్ద దెబ్బే. ఎలా తట్టుకుంటారో? ఫోన్ చేసి మా మామగారితో కాసేపు మాట్లాడి కొంచెం ధైర్యం చెప్పాను.

లంచ్ రూములో సీరియస్ గా "జీవితంలో విలువలు" అన్న విషయం మీద డిస్కషన్ నడుస్తోంది. ఎవరికి తోచిన అభిప్రాయాలు వాళ్లు చెపుతున్నారు. నేను "ఈ రోజుల్లో మనలాంటి వాళ్లకి విలువలు ఎక్కడ ఉన్నాయి?" అన్నాను. నిజమే కదా అని అందరూ నవ్వారు.

రమేష్ మాత్రం ఆశ్చర్యంగా "అదేంటి మేడం అలా అన్నారు? అసలు జీవితంలో విలువలే లేవంటారా" అన్నాడు.

"ఎక్కడి విలువలండీ? అవన్నీ కథల్లోనూ, సినిమాల్లోనే. ఇప్పుడంతా స్ట్రగుల్ ఫర్ ఎగ్సిస్టెన్స్ ఎండ్ సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్. అంతే ". అన్నాను. అతను ఇంకా పొడిగించలేదు. ఎంతైనా బ్రాంచ్ ఇంచార్జిని కదా!

సాయంత్రం ఆరు అయింది. ఎండ్ ఆఫ్ డే రిపోర్ట్స్ వెరిఫై చేస్తున్నాను. ఇది అయిపోతే ఇంక బయలుదేరవచ్చు. హైవాల్యూ విత్ డ్రాయల్ కేసులో ఎర్రర్. ఎవరు చేసారా అని చూసాను. రమణి. పిలిచి "అదేంటండీ, పార్ట్ అమౌంట్ అయితే ఫుల్ అమౌంట్ ప్రోసెస్ చేసారు? పైగా యాభై లక్షలు" ఎక్స్ ప్లెనేషన్ అడిగాను.

"చూసుకోలేదు. దాందేముంది. రివర్స్ చేసి మళ్లీ ప్రోసెస్ చేద్దాము" అంది నిర్లక్ష్యంగా.

కొంతమందితో పని చేయటం ఒక ప్లెషర్, మరికొంతమందితో పని చేయటం పెయిన్. ఈవిడ రెండో కేటగిరి.

అరుణ్ కి మెయిల్ చేసి, ఆయన చేత "అక్షింతలు" వేయించుకుని, ఐటి డిపార్ట్ మెంట్ తో కోఆర్డినేట్ చేసి రివర్సల్ చేయించి మళ్లీ ప్రొసెస్ చేసేటప్పటికి అరగంట పట్టింది.

ఆఫీసుకి లేటయినప్పుడే బాస్ ఫోన్ చేస్తాడు; ఇంటికి పెందరాళే వెళ్లాల్సి వచ్చినప్పుడే ఆఫీస్ లో ఎమర్జెన్సీ వస్తుంది – "మర్ఫీస్ లా".

ఆఫీస్ బయటకి వచ్చేటప్పటికి మా వారు వెయిట్ చేస్తున్నారు, పాపం అరగంట నుంచి. అయినా విసుక్కోలేదు. ఆయన సహనానికి నేను ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోతూనే ఉంటాను.

దారిలో సడెన్ గా "బాబాయిని ఇక్కడికి తీసుకువచ్చి ట్రీట్ మెంట్ ఇప్పిస్తే ఎలా ఉంటుంది?" అన్నారు.

"ఇది ఎవరి ఐడియా?" చాలా షార్ప్ గా రియాక్ట్ అయ్యాను

"నాకే అనిపించింది. ఆ ఊళ్లో మెడికల్ ఫెసిలిటీస్ అంతగా లేవు కదా" అన్నారు.

"ఏమీ అవసరం లేదు. ఏ బైపాసో చేయాల్సి వస్తే తిరిగి రికవర్ అవడానికి నెలో, నెలన్నరో పడ్తుంది. అన్ని రోజులు మనింట్లోనా? ఏమక్కరలేదు." మా వారు ఏదో చెప్పబోతే నేను వినిపించుకోలేదు.

ఇంట్లోకి వెళ్లేటప్పటికి మా మామగారు ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నారు. "వాడు నాకంటే అయిదేళ్లు చిన్నవాడు. బిపి, షుగరు కూడా లేవు. అయినా ఈ హార్ట్ అటాక్ ఎలా వచ్చిందో?" అంటున్నారు.

మా వారు, మామగారు, అత్తగారు మా పినమామగారి గురించి మాట్లాడుకుంటున్నారు. నేను వంటింట్లో పని చేస్తూ మధ్య మధ్యలో మాట కలుపుతున్నాను. ఆయనని ఇక్కడికి తీసుకురావడం గురించి ఏమైనా అంటారేమో అని నా భయం. మావారికైతే "నో" చెప్పగలిగాను కానీ, మా అత్తగారికి, మామగారికి అంత ఓపెన్ గా చెప్పలేను. ఎవరూ ఆ ప్రసక్తి తేలేదు. "హమ్మయ్య" అనుకున్నాను.

భోజనాలప్పుడు మా అమ్మాయి "సాయంత్రం లక్ష్మి వాళ్ల అమ్మాయి వచ్చిందమ్మా" అంది. మా అత్తగారు వెంటనే "లక్ష్మికి జ్వరంట. రేపు కూడా రాదట. వాళ్లమ్మాయి వచ్చి డబ్బులు కావలంటే వెయ్యి రూపాయలు ఇచ్చాను. ఈ హడావుడిలో ఆ సంగతి మర్చిపోయాను" అన్నారు.

"పోనీలెండి. రేపు శనివారం. నాకు శెలవే కదా" అన్నాను చాలా మామూలుగా. మా వారు ఆశ్చర్యంగా నా వైపు చూశారు. పొద్దున్న పనిమనిషిని ఎంత తిట్టుకున్నానో ఆయనకి తెలుసు మరి!

మా అత్తగారు, "ఆదివారం సుశీల పిన్ని మనవడి బారసాల. మధ్యాహ్నం ఫోన్ చేసింది. మీరూ, పిల్లలూ వెళ్లి రండి" అని మా వారితో అన్నారు.

మా అబ్బాయి "నాకు కుదరదు" అన్నాడు, పెద్ద ఆరిందాలా.

"ఏం?" అడిగాను, వీడి ఫ్రెండ్స్ అందరూ ఏ క్రికెట్ మ్యాచో ప్లాన్ చేసుకుని ఉంటారు అనుకుంటూ.

"మా ఫ్రెండ్ తరుణ్ టెన్ డేస్ స్కూల్ కి రాలేదు కదా. మా టీచర్ వాడి క్లాస్ వర్క్ కంప్లీట్ చేసి మండే సబ్మిట్ చేయమంది. నేను రెండు సబ్జెక్ట్స్ వ్రాసి పెడ్తానని చెప్పాను. అది కంప్లీట్ చేయాలి " అన్నాడు.

"క్రికెట్ ఆడడానికి కూడా వెళ్లవా?" మా అమ్మాయి వెక్కిరించింది "వెళ్లను. మా ఫ్రెండ్స్ కి రానని చెప్పేసాను" అన్నాడు. యథాలాపంగా వింటున్న నాకు చెళ్లున కొట్టినట్లైంది. అన్యమనస్కంగా భోజనం ముగించాను.

పిల్లల్ని జాగ్రత్తగా తలుపులు వేసుకోమని చెప్పి మా అత్తగారిని, మామగారిని బస్సు ఎక్కించి రావడానికి నేను కూడా వెళ్లాను.

ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా ఏదో మాట్లాడుతుండే మా మామగారు చాలా మౌనంగా ఉన్నారు. నేను సరిగ్గా గమనించలేదు కాని, సాయంకాలం నుంచి అలాగే ఉన్నారు. ఒక్క పూటలోనే పది ఏళ్లు పైబడ్డట్టు కనిపిస్తున్నారు.

నాకు మా అబ్బాయీ, వాడి మాటలూ పదే పదే గుర్తుకు వస్తున్నాయి. మామూలప్పుడైతే పట్టించుకునేదాన్ని కాదేమో! వాడి ఫ్రెండ్ కి సహాయం చేయడం కోసం వాడికెంతో ఇష్టమైన క్రికెట్ ని కూడా మానేయడానికి సిద్ధపడ్డాడు. ఎంతో సహజంగా! మరి నేను? చదువుకునే రోజుల్లో ఎంత ఉత్సాహంతో, చైతన్యంతో ఉండేవాళ్లం! మా క్లాస్ మేట్ కి ఆక్సిడెంట్ అయ్యి రెండు నెలలు కాలేజికి రాకపోతే, నేను, నా ఫ్రెండ్ కళ్యాణి పోటీలు పడి మరీ రికార్డులు, నోట్సులు వ్రాసి పెట్టాము. పక్కింటి మామ్మగారికి ఓపిక లేదంటే, ధనుర్మాసం అంతా, తెల్లవారుజామున చలిలో, మా వాకిలితో పాటు వాళ్ల వాకిట్లో కూడా పెద్ద పెద్ద ముగ్గులు వేసి మురిసిపోయాను. అది చిన్నతనమైతే, మరి ఇది?

అప్పుడు నా ప్రపంచంలో, మా అమ్మ, నాన్న, తమ్ముడు, మామ్మ, తాతయ్య, అమ్మమ్మ, మామయ్య, అత్తయ్య, వాళ్ల పిల్లలతో పాటు, ఫ్రెండ్స్, పక్కింటి మామ్మగారు, ఎదురింటి అత్తయ్యగారు, మా కాలనీ రాములవారి గుళ్లో పూజారి … ఇంకా ఎంతమందో! సినిమాలూ, పుస్తకాలూ, పాటలూ, గుళ్లో శ్రీరామ కళ్యాణం, కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలూ, పెరట్లో మొక్కలు, పక్కింట్లోంచి రాలి పడే పున్నాగలూ, పారిజాతాలూ, వీధి మొదట్లో ఎర్ర తంగేడు చెట్టు … ఇలా ఎన్నో! మరి ఇప్పుడు?

మనకి కలిగే పరిచయాలు, అనుభవాలు మన ఆలోచనలని విస్తృతం చేయాలి; మనసుని చైతన్యవంతం చేయాలి; జీవితాన్ని వికసింప చేయాలి. లేకుంటే వాటికి విలువా లేదు – వాటి అవసరమూ లేదు. మా మామ్మ కూడా ఎప్పుడూ "మాట సాయం – మనిషి సాయం" అంటూండేది.

బస్సు బయలుదేరుతుంటే మా మామగారితో "మీరేమీ దిగులు పడద్దు. అవసరమైతే చిన్నమామయ్యగారిని మనింటికి తీసుకురండి. ఇక్కడే మంచి డాక్టర్ కి చూపిద్దాము" అన్నాను. ఆయన మొహంలో అంత సంతోషం నేనెప్పుడూ చూడలేదు. బహుశ ఆయన మనసులో కూడా అదే అలోచన ఉండి ఉంటుంది. చెప్పలేదంతే. నాక్కూడా ఎందుకో ఇందాకటి నుంచి ఉన్న చిరాకు, విసుగు పోయి హాయిగా ఉంది.తిరిగి వచ్చేటప్పుడు మా వారు "ఏమిటీ ట్విస్ట్" అన్నారు. ఆయన మొహం కూడా వెలిగిపోతోంది. "ఏం లేదు. ఏదో మన వాళ్లకి మనం" అన్నాను.

"అయినా రాముడు – భీముడు లాగ ప్రతి విషయానికి రెండు రియాక్షన్లు ఉంటాయేంటి నీ దగ్గర" అని నవ్వారు.

నేను నవ్వలేదు.      మధ్యహ్నం లంచ్ రూం లో జరిగిన డిస్కషన్ గుర్తుకు వచ్చింది.      ఇదేనా విలువలతో జీవించడం అంటే – క్షణం క్షణం మనని మనం సరి చూసుకుంటూ, సరి చేసుకొంటూ?      ఏమో?




కాయల్లా పగుల్తున్నా పసిడి పంటలను రాశులుగా పోస్తున్నాడు. వాసి లేకుండా వాడిపోతున్నాడు. రైతే రాజు అందరివి పైపై మాటలే. రైతును పట్టించుకునేదెవరు?

కాసేపు కన్నీటితో తడిసిన రాముడి మనసు కుదుటపడింది. గంగారాం మోసగాడని తెల్సు. 'అయినా వూరంతా కొంటున్నారు? కాలం పోతే విత్తు మొలవదు!' పలు విధాలుగా సతమతమయ్యాడు.

చేతులు పిసుక్కుంటూ.... నీళ్ళు నముల్తూ... గంగారాం ముందు తల దించుకొని నిలబడ్డాడు. ఆవులిస్తే పేగులెక్కెట్టే గంగారాం "ఏరా! రాముడు! విత్తనాలు కావాలా?" కుర్చీలో కాలు మీద కాలేసుకొని దర్పంగా ఊపుకుంటూ అడిగాడు.

"తమరు దయ సూపెట్టాలి! ఈసారి డబ్బు లేదు" మెల్లగా అన్నాడు రాముడు.

"ఇంత వరకు నువ్వు అప్పు చేయలేదు. ఐనా డబ్బెక్కడికి పోయిద్ది! పంటొస్తది గదరా!" స్టాంపు కాగితాలపై వేలిముద్ర

తీసుకున్నాడు. మరో కాగితం ముక్కపై తన సంతకం చేసి, తేది వేశాడు. "ఇదిగో! ఈ కాగితం షాపులో ఇచ్చేసి, విత్తనాలు పట్టుకపో!" అన్నాడు.

"యిత్తనాలకెంతైంది బాబు?"

"పదిహేను వేలయిందిరా?" అన్నాడు గంగారాం.

"ప్చ్!" నిట్టూర్పు విడుస్తూ దారి పట్టాడు. ఇవే విత్తనాలు సిటిలో పది వేలు. ఒక్కోసారి ఒకరి అవసరం మరొకరికి వరమవుతుంది. 'పంటొచ్చే సరికి పదేనేలు దానికి వడ్డీ!' మనసులోనే లెక్కలేసుకుంటూ షాపుకెళ్ళాడు. విత్తనాలు సంచులను తీసుకొని, దిగుబడి వచ్చినంత సంబరంగా ఇంటికెళ్ళాడు.

"సీతా! యెలాగోలా యిత్తనాలు దొరికినయ్! కూలోల్లను తీసుకొని, తొందరగా చేనుకొచ్చేయ్!" అంటూ అరక తోలుకెళ్ళాడు. స్కేలుతో గీత గీసినట్లే సాలు వెంబడి సాలు అరక తోలాడు. ఉల్లాసంగా పరుగులు తీసాడు. కూలోల్లను పరుగులు పెట్టించాడు. నాటే ప్రతి విత్తనం పది రెట్లు దిగుబడి రావాలని అనుకున్నాడు. రెండ్రోజులు కష్టపడి పత్తి విత్తనాలు నాటాడు. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

*            *        *

వారం... పది రోజులు గడిచాయి. ఒక్క గింజా మొలవలేదు. ఉత్సాహానికి ఉరి పడ్డట్లయింది. చుట్టుప్రక్కల చేలల్లో సగానికి పైగానే మొలకలు. రాముడికేం అంతుబట్టడం లేదు. ఇరుగు పొరుగు రైతులకు తన చేను చూపెట్టాడు. ఐదెకరాల్లో ఒక్క మొలకా లేదు. రాముడికి జరిగిన మోసంపై రైతులంతా నానా రకాలుగా ఆవేదన వెలిబుచ్చారు.

"యాపార మన్నంక మంచి, సెడుంటాయి. గానీ యింత దగానా? సొంతం నకిలీ యిత్తనాలే యిచ్చిండు. అన్నాడో రైతు.

"గంగారాం గాడు పెద్ద దొంగ. మన కర్మకాలి వాడి దగ్గర యిత్తనాలు కొంటున్నాం. పంటకు మంచి ధరలుంటే మనకీ నాలుగు రూపాయలు చేతిలో ఆడ్తాయి. మనమే సిటికెల్లి మంచియేవో తెల్సుకొని మరీ తెచ్చుకుంటాం. యెదేమైనా రాముడికి పెద్ద

అన్యాయమే జరిగింది. గంగారాం గాడ్ని నిలదీయాల్సిందే!" కోపంతో ఊగాడో రైతు.

"సాల్లే ఆపరో నీ మాటలు. గంగారాంతో ఢీ అంటే సావుకు ఎదురుబోవడమే. వాడేమన్నా తెలివితక్కువోడా? కంపెనోళ్లు పంపిన్రు. నేనమ్ముతున్నా. కాదు కూడదంటే కంపెనోళ్లపై కేసు యేయ్యమంటడు. కేసులు, కోర్టులు మన బోటోల్లతో అయ్యే పనేనా?" మరో రైతు అనగానే తలో దిక్కుకు ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

వేల ప్రశ్నలను వెంటేసుకొని ఇంటికి చేరాడు రాముడు. "యేమయ్యా! సేనెట్లుంది? మొలకలొచ్చాయా?" ఆతృతగా అడిగింది సీత. వచ్చాయని చెప్పలేదు, రాలేదని చెప్పలేదు. బెల్లం కొట్టిన రాయిలా కూలబడ్డాడు. కళ్ళ నిండా కన్నీటి ఊటలు. రాముడి తీరుకు సీతలో అనుమానం మొలిచింది. "యేం సెప్పవేంది? యేమైందయ్యా?" తనూ పక్కనే కూలబడ్తూ అంది సీత. "ఒక్క మొలకా లేదే! మనం నిండా మునిగాం. సేతుల కట్టం బూడిదలో పోసిన పన్నీరైంది" గూడు చెదిరిన పక్షిలా రోదించసాగాడు రాముడు.

సీత గుండెల్లో ప్రకంపనలు. క్షణకాలం షాక్ తగిలినట్లైంది. ఆమె విన్నది నిజమా? అబద్ధమా? ఎటూ తేల్చుకోలేకపోయింది. తన్నుకొచ్చిన దు:ఖాన్ని కళ్ళల్లో పొంగించింది. క్రికెట్ ఆడి... ఆడి.. వచ్చాడు కొడుకు. ఏం జరిగిందో తెల్సుకునే ప్రయత్నము చేయలేదు. వాళ్లూ చెప్పే పరిస్థితిల్లో లేరు. చడీ, చప్పుడు లేకుండా మంచంలో కూలబడ్డాడు.

ఆమె అణువణువు ఆగ్రహ జ్వాలలు చెలరేగాయి. కారుతున్న కన్నీటిని కొంగుతో తుడ్చుకుంటూ "లండీ కొడుకు... యెంత దగా చేసిండు? కడుపుకు బువ్వ దింటుండా? గడ్డి దింటుండా? నీతి లేని కుక్క! వాంబో! వాంబో! పైసలేమన్నా సెట్లకు గాస్తున్నయా? పొద్దుగాల్నే యేదొకటి తేల్సుకోవాలి!" గుండెలు బాదుకుంటూ గంగారాంను తిట్టసాగింది. సీత మాటలకూ రాముడిలోనూ పౌరుషం పెరిగింది.

"ఆ దొమ్మరోడ్ని నిలదీయాల్సిందే!" అనుకుంటూ సిటికెళ్ళాడు. పోలీస్ స్టేషన్లో ఎస్.ఐ.ని కలిశాడు. జరిగిన సంగతంతా చెప్పాడు. గంగారాం మాటినగానే ఎస్.ఐ.కు ఒళ్లు కంపించింది. "చూడు రాముడు! ఆయన పలుకుబడున్నోడు. తిమ్మిని బొమ్మిని చేస్తాడు. ఆయనతో పోట్లాటెందుకు? ఆయనతో నెమ్మదిగా మాట్లాడండి. నీకు జరిగిన నష్టానికి ఎంతో కొంత సాయం చేయకపోడు" ఎస్.ఐ. తప్పుకున్నాడు.

రాత్రైంది. పుట్టెడు దు:ఖంలో ఇంటిల్లిపాది. మెతుకు ముట్టలేదు. చేను మొలకలు రాలేదనే పచ్చి నిజం మింగుడుపడటం లేదు. కునుకు రావటం లేదు. జాగరణలతోనే రాత్రంతా గడిపారు.

ఉయ్యాల్లో ఊగుతూ ఓ చేత్తో పేపరు చూస్తూ, మరో చేత్తో టీ తాగుతున్నాడు గంగారాం. ఎదురుగా రాముడు, సీత్. ఏంటన్నట్లు కనుబొమ్మలెగరేసాడు. "అయ్యా! మీరిచ్చిన పత్తి యిత్తనాలు నకిలివి కాబోలు మొలవలేదు. నాకు చానా నట్టం జరిగింది. మంచి యిత్తనాలన్నా యియ్యండి! లేదంటే బాకీ కాగితమన్నా సింపేయండి!" చేతులు కట్టుకొని ప్రాధేయపడ్డాడు రాముడు.

"ఏందిరో! నోరు లేస్తంది. కష్టాల్లో ఉన్నారు ఆదుకుందామని దయ చూపిస్తే నాపైనే రివర్సు అవుతునారే. అందరికి ఇచ్చినట్లే నీకూ ఇచ్చాను. మొలవడమా? మొలవకపోవడమా? నా చేతిలో ఏముంది? నేనేమన్నా విత్తానాలు తయారు చేసేటోడ్నా? కంపెనీవే అమ్ముతున్నాను. చాల్లే! ఎవ్వారం బాగానే వుంది. పోండి! పోండి!" గెదుముతున్నట్లు మాట్లాడాడు గంగారాం.

గంగారాం జవాబు సీతలో అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. సివంగిలా లేచింది. "మంది సొమ్ము పున్నానికొస్తుందా? మీరంతా తడిగుడ్డతో గొంతులు కోసే రకాలు. మా ఉసురు తగలకపోదు.... మీ కొంపలు కూలకపోవు... సదువు, బలం లేదని, అడిగెవాడెవడు లేడని మమ్మల్లెంత కాలం మోసం చేస్తరు... మాకు నాయం సేయాల్సిందే!" ఎగిరెగిరి పడసాగింది సీత.

అవినీతి సామ్రాజ్యం ప్రమాదంలో పడ్తున్నప్పుడు, నిజ స్వరూపం బట్ట బయలు కాబోతున్నపుడు ఎలాగూరుకుంటాడు. గంగారాం కళ్ళు చింతనిప్పుల్లా మారాయి. "ఎవడి కొంపలే కూలేది ఆడముండ! ఇష్టం వచ్చినట్లు వాగుతున్నావ్! నా దగ్గరే నాటకాలా?" సీతను కొట్టబోయాడు.

కళ్ళెదుటే పరాయి మగాడు భార్యను కొట్టబోతుంటే ఎంత చేతకాని వాడైనా చూస్తూ ఎలా ఊరుకుంటాడు. రాముడిలో కట్టలు తెగిన ఆవేశం... ఏం జరుగబోతుందో కూడా తెలియని వీరావేశం. గంగారాం పన్నిన వలలో అమాయకంగా చిక్కుకున్నాడు. గంగారాంను వెనక్కి నెట్టాడు. ఉయ్యాల తగిలి కిందపడ్డ గంగారాం 'వామ్మో! వాయ్యో!" అంటూ కేకలేయసాగాడు. హఠాత్ పరిణామానికి నిశ్చేష్టురాలైంది సీత. జరిగిందేమిటో తెల్సేసరికి రాముడికి ముచ్చెమటలు పట్టాయి.

బొడ్రాయి దగ్గర పంచాయితీ మొదలైంది. మొగుడూ, పెళ్లాం కల్సి నన్ను కొట్టారన్నాడు గంగారాం. రాముడు, సీతలను దోషులుగా తేల్చాడు. సమస్యను సామరస్యంగా మాట్లాడుకోకుండా ఊరి పెద్ద గంగారాంపై చేయి చేసుకున్నందుకు పది వేల్ రూపాయల జరిమానా విధించారు పంచాయితీ పెద్దలు.

రాముడు, సీతలకు దెబ్బ మీద దెబ్బ... పులి పంజాలాంటి దెబ్బ... బలహీనుడిపై అనాదిగా పడ్తున్న బలవంతుడి దెబ్బ.

మాడిపోయిన ముఖాలతో ఇంటికి చేరారు.

గంగారాం ఆలోచనలకు రెండువైపులా పదునే. కావాలనే వాళ్ళను రెచ్చగొట్టాడు. తదుపరి సొంతంగా తయారు చేస్తున్న నకిలీ విత్తనాల గుట్టు బయటకు రాకుండా... మరొకరు నోరెత్తకుండా... ఒక్క దెబ్బకు రెండు పిట్టలను కొట్టాడు. దాంతో తన అక్రమ సంపాదనకు గట్టి బందోబస్తు చేసుకున్నాడు.

సాయంత్రమైంది. పచ్చి మంచినీళ్ళూ ముట్టడం లేదు రాముడు, సీత. మోసం... తరతరాలుగా జరుగుతున్న మోసం... విత్తనాలు కొనడం. అవి మొలవకపోతే అప్పు మీద అప్పు చేసి, మళ్ళీ విత్తనాలు తెచ్చి నాటడం. వచ్చిన పంటను దళారులు చేతుల్లో పెట్టడం. రైతు శ్రమను దోచుకుంటూ పైశాచికానందంతో రాబందులు చేస్తున్నా వికట్టహాసం... వారి కాళ్ళనిండా మెదులుతోంది...

వేడినీళ్ళలా సలసల మరుగుతోంది వారిలో కోపం...

కానీ ఏం చేయలేని నిస్సహాయ స్థితి!

చీకటి పడింది. ఒక్కసారిగా వూరంతా అలజడి. "బాగా తాగి బైపాస్ రోడ్డులో వస్తున్న గంగారాం బండి బ్యాలెన్స్ తప్పి పడిపోయాడట. పెద్ద రాయి తలకు బలంగా తగలటంతో అక్కడికక్కడే చచ్చిపోయాడట" చెప్పుకుంటూ పరుగులు పెడ్తున్నారు జనం. అర్థం కాక, ఆశ్చర్యంతో ఒకర్నొకరు చూసుకున్నారు రాముడు, సీత.

చాలా రాత్రైంది. ప్రమాద స్థలం నుంచి గంగారాం శవం ఇంటికి చేరింది. శవం దగ్గర ఏడ్పులు తగ్గుతున్నాయి. ఊరంతా సద్దు మనిగింది.ఇంటికొచ్చాడు కొడుకు. చేతిలో క్రికెట్ బ్యాట్. దానిపై అక్కడక్కడా రక్తపు మరకలు. ఇన్నాళ్లూ కొరకరాని కొయ్య... ఇప్పుడు కొండంత అండలా కనిపిస్తున్నాడు. రాముడి కళ్ళల్లో మెరుపు. "యేమన్న గానీ ముత్తానికి వూరికి పట్టిన చీడ యిరగడైందిరా కొడకా!" కొడుకును మెచ్చుకుంటూ... బ్యాట్ను కట్టెలపొయ్యిలో వేసి నిప్పు రాజేసాడు. ప్రశాంతంగా గాలి పీల్చుకుంటూ తలుపులు మూసింది సీత.

*          *          *

(రంజని - నందివాడ భీమారావు 2015 కథానికల పోటీల్లో చతుర్థ బహుమతి పొందిన కథ.)




సుజాత, సురేష్ లకు లేకలేక పుట్టినవాడు రామం. అందువల్ల అల్లారుముద్దుగా పెంచారు. రామం ఎనిమిదో తరగతి చదువుతున్నా పెద్దలని గౌరవించడం, మర్యాద చూపడం తెలుసుకోలేదు. నోటికి వచ్చింది రామం మాట్లాడేవాడు. వాడిని సరియైన మార్గంలో పెట్టాలని ప్రయత్నించి విఫలమయ్యారు తల్లిదండ్రులు.

ఒకసారి రామం మేనమామ కుటుంబం చుట్టరికానికి వచ్చి వారం రోజులున్నారు. 'పోయిన సంవత్సరం మీ ఊరు వచ్చి మీ ఇంట్లో మూడు రోజులే ఉన్నాము. మీరేంటి ఏకంగా వారం రోజులు తిష్ట వేసారు' అని ముఖం మీదనే అడిగాడు రామం. రామం మాటలకు తెల్లబోయిన చుట్టాలు తెల్లారి బస్సుకే వెళ్ళిపోయారు. వాడి అమ్మానాన్నలే రామం చేత అలా అనిపించారని అనుకున్నారు మనసులో.

ఒక ఆదివారం ఉదయం అంగడిలో సరుకులు కొనడానికి తల్లికి తోడుగా వెళ్ళాడు రామం. అక్కడ సుజాత చిన్ననాటి స్నేహితురాలు కనిపించి ఆప్యాయంగా మాట్లాడింది. దగ్గరలోని దుకాణంలో పండ్ల రసం త్రాగుదామని తీసుకెళ్ళింది. ముగ్గురూ పండ్లరసం త్రాగిన తరువాత దుకాణం వాడికి డబ్బు చెల్లించబోయింది సుజాత. కాని స్నేహితురాలు వారించడమే

కాకుండా డబ్బు చెల్లించబోయింది.

'చాలా రోజుల తరువాత కలిసాము. ఎవరు చెల్లించినా తప్పు లేదు" అంటూనే డబ్బు చెల్లించడానికి ముందుకు వెళ్ళింది సుజాత. ఆమె స్నేహితురాలు కూడా పట్టు విడవకుండా 'మిమ్మల్ని పిలిచింది నేనే కాబట్టి డబ్బు చెల్లిస్తాను' అంది.

స్నేహితురాలుతో తన తల్లి వాదించడం చూసాడు రామం. వాడికి కోపం వచ్చి "మీ స్నేహితురాలు డబ్బు చెల్లిస్తానని ముచ్చట పడుతుంటే ఆపుతావెందుకు? నువ్వు ఆగినప్పుడే కదా ఆవిడ నిజంగా ఇస్తుందో, మాటవరుసకి అంటుందో తెలిసేది' అన్నాడు.

ఆ మాటలు విన్న సుజాత స్నేహితురాలు ముఖం చిన్నబోయింది. తన పర్సులో నుండి డబ్బు తీసి దుకాణం వాడికి ఇచ్చి 'మీ వాడికి మంచి బుద్ధులు నేర్పించు' అని సలహా ఇచ్చి వెళ్ళిపోయింది. తల కొట్టేసినంత పనయింది సుజాతకు.

అది జరిగిన తరువాత ఆదివారం నాడు సురేష్ స్నేహితుడు పని ఉండడంతో వాళ్ళింటికి వచ్చాడు. ముఖ్యమైన పని కావడం వల్ల గంటన్నర దాటినా కదలలేదు. అప్పటికి భోజనాల వేళ అయింది. వంట గదిలో పనిలో ఉన్న సుజాత భోజనాలకు సిద్ధం చేస్తూ 'నాన్నని భోజనానికి పిలువు' అని రామంతో చెప్పింది.

అప్పటికి రామం ఆదివారం అనుబంధంలో ఉన్న పిల్లల పేజీని చదువుతున్నాడు. తల్లి పని చెప్పేసరికి వాడికి చిరాకు పుట్టింది. వెంటనే " నాన్నగారి స్నేహితుడు అంత తొందరగా వెళ్ళే రకంలా లేడు. ఏకంగా భోంచేసి వెళతాడేమో! ఇద్దరికీ వడ్డించవలసి ఉంటుంది" అన్నాడు గట్టిగా రామం. ఆ మాటలు బయట ఉన్న స్నేహితుడుకి వినిపించాయి. దాంతో వారిద్దరి సంభాషణని మధ్యలోనే ముగించి వెళ్ళిపోయాడు.

సుజాత, సురేష్ లే రామం చేత అలా అనిపిస్తున్నారని అందరూ అనుకునే పరిస్థితి వచ్చింది. అలా అనకూడదని చెబుతున్నా వినిపించుకోడు రామం.

నెల తరువాత రామం పుట్టిన రోజు వచ్చింది. రామంని తీసుకుని గుడికి వెళ్ళారు సుజాత, సురేష్. రామం చేత్తో కొబ్బరికాయను అర్చకుడికి అందించమని చెప్పింది సుజాత. సజ్జలోని కొబ్బరికాయను తీస్తుండగా రామం చేతి నుండి జారి ముక్కలయింది.

‘అయ్యయ్యో ! దేవుడికి కొట్టాల్సిన కొబ్బరికాయ కింద పడేసాడు!’ అంది సుజాత బాధగా.

‘అలా చేసావేం రామం?’ అన్నాడు సురేష్ నొచ్చుకుంటూ.

“ఫరవాలేదు. మీ రామం కొబ్బరికాయను అతికించేస్తాడు’ అన్నాడు అర్చకుడు.

“ కొబ్బరికాయను నేనెలా అతికిస్తాను?” ఆశ్చర్యపోయి అడిగాడు రామం.

“పోనీ కింద జారుతున్న నీటిని గిన్నెలో చేర్చగలవా?’ అని మరో మారు అడిగాడు అర్చకుడు.

‘అలాంటివి చెయ్యడం కుదరదు’ చెప్పాడు రామం.

‘ఆతకించడం రానప్పుడు ముక్కలు చేసావెందుకు?” మళ్ళీ అడిగాడు అర్చకుడు.

“పొరపాటున చెయ్యి జారింది. ఇంకొక కొబ్బరికాయ తెమ్మంటారా?” చిరాగ్గా అన్నాడు రామం. సుజాత, సురేష్ మౌనంగా చూస్తున్నారు. ‘కొబ్బరికాయ కాబట్టి పగిలినా ఇంకోటి కొనగలవు. మరి పగిలిన హృదయాలను ఎక్కడ నుండి కొంటావు? కొబ్బరికాయనే అతకడం చేతకాని వాడివి హృదయాలను అతకగలవా?” అని నవ్వుతూ అడిగాడు అర్చకుడు.

“మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావడం లేదు” నిజాయితీగా చెప్పాడు రామం.

“ఇంటికి వచ్చే అతిథులతో , అమ్మానాన్నల స్నేహితులతో దురుసుగా మాట్లాడుతూ వాళ్ళ హృదయాలను గాయపరిచి ముక్కలు చేస్తున్నావు. వారి హృదయాలకు తగిలిన గాయాలు కొబ్బరిచిప్పలా పైకి కనిపించవు. కానీ స్నేహాలు, బంధుత్వాలు దూరమౌతాయి. అందుకే మనం సరి చేయలేని వాటిని పాడు చేయకూడదు. భగవంతుడు కూడా ఒక

ప్రాణం తీసుకుపోతే మరొక రూపంలో ప్రాణం పోస్తున్నాడు. మామూలు మనుషులం మరెంత జాగ్రత్తగా మెలగాలి? బాగా ఆలోచించి ఈ పుట్టిన రోజు నుండి నీ మాట తీరు మార్చుకో!అమ్మానాన్నలకు చెడ్డపేరు తెచ్చే పని మానుకో” అన్నాడు అర్చకుడు.

తాను చేస్తున్న తప్పు చాలా స్పష్టంగా బోధపడింది రామానికి. ‘ఇక ముందు బుద్ధిగా ప్రవర్తిస్తాను” అన్నాడు తలొంచుకుని.ఇంట్లోనే కొబ్బరికాయకు నూనె పట్టించడం వల్ల చేతి నుండి జారిందనీ, అర్చకుడు తన తండ్రి స్నేహితుడనీ, తమ మాటలని లక్ష్యపెట్టని రామంకి బుద్ధి వచ్చేలా అతడితో అమ్మానాన్నలే నాటకం ఆడించారని రామంకి తెలీదు.




"నిజంగా నిజమేనా" ఆనందం పట్టలేక మరోసారి అడిగాడు ఆకాష్ మహితను. సిగ్గుతో తలాడించింది మహిత.

“ఇంత అపురూపమైన కానుక నాకివ్వబోతున్నందుకు ఏం కావాలో కోరుకో" మహిని దగ్గరకు తీసుకుంటూ అడిగాడు ఆకాష్.
“అవునా! మీకు అబ్బాయి కావాలా? అమ్మాయి కావాలా?” ఉత్సుకతతో అడిగింది మహి.

“ప్చ్ అబ్బాయా! అమ్మాయా!” కాస్సేపు ఆలోచించినట్లు నటించి “అమ్మాయి అయితే ప్రాకులు వేయొచ్చు, నగలు పెట్టొచ్చు.

అమ్మాయే కావాలి. అదీ నీలాంటి అమ్మాయే కావాలి. కనగలిగితే అలాంటి అమ్మాయినే కను" ముద్దులు కానుకగా ఇస్తూ అన్నాడు. అప్పటి వరకూ మనసులో ఏమూలో ఉన్న సంశయం కాస్త తొలగిపోయింది మహికి. దాంతో ఆకాష్ కౌగిలిలో ఆనందంగా కరిగిపోయింది.

"నిజమేనా!" కొడుకు చెప్పిన వార్త విని మరోసారి మహిని అడిగి నిర్ధారించుకుంది రత్నావతి, ఆకాష్ తల్లి.     అత్తగారు ఉత్సాహం పట్టలేక నిజమా అని ఆనందంతో తననెంత ముద్దు చేస్తారో అని సిగ్గుతో ఎదురుచూస్తున్న మహి ఆవిడ ఏం మాట్లాడకపోయేసరికి తలెత్తి చూసింది. ఆవిడ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

ఆకాష్ ఆ విషయం గ్రహించకుండా "అమ్మా! మేము క్రిందికి మారిపోతాము. మహికి     మెట్లు ఎక్కడం,దిగడం ఇక అంత మంచిది కాదు కదా!" అన్నాడు.

"చూద్దాంలేరా" అని "ఎన్నో నెల?" మహిని అడిగింది రత్నావతి.     "రెండు నిండాయత్తయ్యా" మనసులో ఏదో శంక పొడసూపుతుంది. "ఈ విషయం ఇంకెవరికి తెలుసు?" మహిని అడిగింది రత్నావతి. అప్పటికి ఆకాష్ కు కూడా విషయం ఏదో ఉందని అర్ధం అయింది. "ముందు నీకే చెప్పామమ్మా" మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ అన్నాడు ఆకాష్. నిర్ధారణ కోసం ఆవిడ మహిని చూసింది.

"డాక్టరు దగ్గర నుండి వచ్చాక ముందు ఆయనకు, ఇప్పుడు మీకు చెప్తున్నామత్తయ్యా" లోగొంతుతో చెప్పింది మహి. "సరే! అప్పుడే ఇంకెవరికీ చెప్పకు. ఎప్పుడు చెప్పాలో నేను చెప్తాను". అప్పటికి ఇదేదో మామూలు విషయం కాదని అర్ధం అయింది ఆకాష్ కి.

"అదేమిటమ్మా! అలాగంటావు. ఈ విషయం వింటే అత్తయ్యగారు,మామయ్య గారు ఎంత సంతోషిస్తారో! అన్నాడు ఆకాష్. " "ఇంత తొందరగా ఎందుకు చెప్పడం. నాలుగు నెలలయ్యాక చెప్దాము."

"అమ్మా! నాలుగు నెలల వరకూ ఎందుకూ?" సూటిగా అడిగాడు.

"ఆడబిడ్డో మగ బిడ్డో కనుక్కుని" ఆవిడ మాట ఇంకా పూర్తి చెయ్యనే లేదు "అమ్మా!" గట్టిగా అరిచాడు ఆకాష్. మహికి నిలుచున్నపాటు పాతాళంలోకి జారిపోతున్నట్లు అనిపించింది. పది నిముషాల కిందట భార్యా భర్తలిద్దరూ ఆనందంలో తేలిపోయారు. ఇంతలో ఇదేమిటి? ఈ ఆనందం శాశ్వతం కాదా!

“అమ్మా నాకలాంటి పట్టింపులు లేవు. అసలు నాకు కూతురే కావాలి. నువ్వు కూడా ఇంకేం మనసులో పెట్టుకోకుండా మాతో కలిసి ఆనందిస్తే ఆనందించు. లేకపోతే లేదు” గట్టిగా చెప్పాడు. అప్పటికి కాస్త ధైర్యం వచ్చింది మహికి. ఆకాష్ చేయి గట్టిగా పట్టుకుంది.

“నా భయమూ అదేరా ఆడపిల్ల ఎక్కడ పుడుతుందోనని” నెమ్మదిగా అన్నారావిడ.

“అమ్మా! కోపం తెచ్చుకోకుగాని, నువ్వూ ఆడపిల్లవే కదా! మీ నాన్నమ్మ నీలా ఆలోచిస్తే నువ్వు ఉండేదానివి కాదు కదమ్మా” ఒకింత కోపంగానే అన్నాడు ఆకాష్.

“నిజమేరా! కాని అప్పటి పరిస్థితుల్లో ఆవిడకు అలాంటి ఆలోచన వచ్చే అవకాశం లేదురా.”

“ఇప్పుడేమైందమ్మా నేను బాగా సంపాదిస్తున్నాను. నాకూతురికి ఎంతైనా పెట్టగలను.” "నీకు అంతవరకే అర్ధమయింది. కానీ అంతవరకూ నా మనవరాలు ఉండాలికదరా" భారంగా వినవచ్చింది ఆవిడ మాట.

“అమ్మా! నీ మనసులో ఉన్నది సూటిగా చెప్పు” నిలదీసాడు ఆకాష్.

“చెప్తానురా. నట్టింట్లో ఆడపిల్ల తిరుగుతుంటే ఆ ఆనందమే వేరురా. కాని ఇప్పుడు ఆడపిల్ల పుడుతుందంటే భయంతో వణికిపోతున్నారు తలితండ్రులు. మా నాన్నమ్మ నాలా ఆలోచించలేదంటే ఆవిడకు ఆవిడ మనమరాలి భద్రత గురించి పూర్తి భరోసా ఉండేది. ఇప్పుడు అలా కాదురా. మనవరాలు పుడుతుందంటే భయం వేస్తుందిరా! అప్పట్లో మహా అయితే ఎదిగిన ఆడపిల్లల గురించి భయం ఉండేది. వాళ్ళకు జాగ్రత్తలు చెప్పేవారు. ఇప్పుడో ఊహ తెలియని పసి పిల్లలను సైతం.... వదలడంలేదురా! ఇప్పుడు ఆడపిల్ల అంటే.... ఎప్పుడు ఏ మానవ మృగం వెంటాడుతుందో! ఏనిముషం ఏమాట వినాల్సి వస్తుందో! అని గుండెలు కొట్టుకుంటున్నాయిరా ఆడపిల్లల కన్నవాళ్ళకు. ఇప్పుడు రెండేళ్ళకే ప్లేస్కూల్ కని పంపిస్తున్నాము. మాటలు కూడా పూర్తిగా రాని ఈ చిట్టితల్లులు కాముకుల పశుత్వానికి బలి అవుతుంటే.... కంట కన్నీళ్ళు కాదురా! గుండెల్లో రక్తం కారుతుందిరా. ఎప్పుడు అటువంటి వార్తలు విన్నా, చదివినా ఇంకా పుట్టని మన చిట్టితల్లే గుర్తుకు వస్తుందిరా! అందుకే అటువంటి బాధ మన చిట్టితల్లికి ఎప్పుడూ రాకుండా, బాధ అయినా ముందే.... మాట పూర్తి చేయలేక ఆగిపోయింది. ఆవిడ కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. ఆవిడ బాధ అర్ధమైన మహి, ఆకాష్ ఆవిడను దగ్గరకు తీసుకున్నారు ఓదారుస్తూ.

************************************

స్కానింగులో ఏ బిడ్డో చెప్పకూడదు అని చట్టముంది. కాని డబ్బుకు అమ్ముడు పోయేవాళ్ళు ఎప్పుడూ కొంతమంది ఉంటారు. కడుపులోని బిడ్డ మగ బిడ్డే అవాలని వేయి దేవుళ్ళకి మొక్కుకుంది మహి. మగబిడ్డంటే ప్రత్యేకమైన అభిమానంతో కాదు. ఆడపిల్ల అయితే తన చేతులతే తానే .... కాని ఏ దేవుడూ ఆమె మొరను ఆలకించలేదు. భారమైన మనసులతో ముగ్గురూ డాక్టరు దగ్గరకు వెళ్ళారు. “చెప్పండి? ఏమిటి బాధ? ఎవరికి?” నవ్వుతూ అడిగింది డాక్టరు. మహి,ఆకాష్ మాట్లాడలేక పోయారు. “అబార్షను చేయిద్దామని" రత్నావతే నెమ్మదిగా చెప్పింది. “ఎందుకని? ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. మహి తలదించుకునే ఉంది. టప,టపా కన్నీటి బొట్లు కారాయి. ఆకాష్ మహి చేయి పట్టుకున్నాడు ఓదారుస్తున్నట్లు. డాక్టరుకి పరిస్థితి అర్ధమైంది. భార్యా భర్తలిద్దరికీ ఇష్టంలేదు. పెద్దామె బలవంతంతో వచ్చారు. ఇలాంటి కేసులు ఎన్ని చూసిందో తన సర్వీసులో.

“మీ కోడలు ఆరోగ్యంగా ఉంది. బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడతాడు. మీకేం భయం అక్కరలేదు.” రత్నావతిని చూసి చెప్పింది డాక్టరు. “అదికాదు డాక్టర్”

“ఆ ఇంకో విషయం. తొలి చూలుకి అబార్షను చేయిస్తే , ఏదన్నా అటూ, ఇటూ అయితే మరల గర్భం దాల్చడం కష్టం. ఆలోచించుకోండి" సుందరమ్మ ముఖంలో భయం తొంగిచూసింది. అమ్మో! రేపు మహి గొడ్రాలుగా అయిపోతుందా? వద్దు! వద్దు! అంతలో కామ పిశాచి కళ్ళ ముందు కనిపించింది. అమ్మో! అసలే వద్దు.

“అదికాదు డాక్టర్! స్కానింగులో ఆడపిల్ల అని తెలిసింది” ధైర్యం కూడగట్టుకుంటూ అంది రత్నావతి.

“అయితే!” తిరిగి ప్రశ్నించింది డాక్టర్.

“మాకొద్దు” గుండెదిటవుచేసుకుంటూ చెప్పింది రత్నావతి.

“ఏం1 మీరూ ఆడపిల్లే కదా! మీ కోడలూ ఆడపిల్లే కదా!” సూటిగా అడిగింది డాక్టర్.

“మీరన్నది నిజమేనమ్మా. మా పెద్దవాళ్ళు మాలా ఆలోచించి ఉంటే మనము ఉండేవాళ్ళము కాదు. మనం బతికినన్నాళ్ళూ బతుకుతాము అన్న ధైర్యం ఉంది కాబట్టి వాళ్ళు మనలను కన్నారు. ఇప్పుడా ధైర్యం లేదు. ఆడబిడ్డ పుట్టిన నుండి అనుక్షణం భయంతో బతకవలసి వస్తుంది. ఎవడి కళ్ళు చిట్టితల్లి మీద పడతాయోనని. అందుకే డాక్టర్ వద్దు అనుకుంటున్నాము” సూటిగా చెప్పింది రత్నావతి.

ఆమె మాటలకు, అందులోని బావానికి కదిలిపోయింది డాక్టరు. రేపెప్పుడో కట్నం ఇవ్వాల్సివస్తుందని ఆడపిల్లలను వద్దనుకున్నవాళ్ళను చూసింది గాని ఈ కారణముతో వద్దనుకున్న వాళ్ళను ఇప్పుడే చూస్తుంది.

“మీ బాధ నాకు అర్ధమయింది. కాని ఒక విషయం మీరు మర్చిపోతున్నారు. తప్పు ఒకరు చేస్తుంటే శిక్ష ఇంకొకరికి వెయ్యాలనుకుంటున్నట్టు ఉంది. తప్పు చేస్తున్నది మగవాళ్ళైతే ఆడబిడ్డను గర్భంలోనే చంపెయ్యాలనుకోవడం ఎంత వరకు సమంజసం? ఆడపిల్లల ఈ పరిస్థితికి కారణం మగవాడు. అలాంటప్పుడు వాడు పుట్టకుండా చెయ్యాలనుకోవడం కొంతవరకు సబబేమో గానీ ఆడబిడ్డను చంపెయ్యాలనుకోవడం మూర్ఖత్వం. అసలు సమస్య ఎక్కడ మొదలవుతుందంటే మనం ఆడపిల్లలకు ఎలా ఉండాలో చెపుతున్నాము గానీ, మగపిల్లలకు ఎలా ఉండగూడదో చెప్పడము లేదు. పుట్టుకతోనేవాడిని ఈ లోకంలోకి రెండు చేతులూ చాచి మరీ ఆహ్వానిస్తున్నాము. మీకేం మగపిల్లలంటున్నాము. అలా వాడికి కనిపించని రెండు అహంకారపు కొమ్ములు మనమే తగిలిస్తున్నాము. ఆడపిల్లలను ఎంక్వైరీ చేసినదానిలో పదోవంతు మగపిల్లలను ఎంక్వైరీ చేస్తే ఈ దారుణాలు జరగకుండా ఆపవచ్చు. మగపిల్ల వాడిని ఏరా! ఇంతవరకు ఎక్కడ తిరిగావు? ఇచ్చిన డబ్బు ఎలా ఖర్చు చేసావు? అని ఇంటికి రాగానే మనం అడుగుతూ ఉంటే ఆడపిల్లల మీద ఇన్నిన్ని అఘాయిత్యాలు జరగవు. అలాగే మన ఆలోచనా విధానమూ మారాలి. ఎవరిమీదైనా అత్యాచారము జరిగితే వాళ్ళకు ఏ విధముగా మేలు చేయని, పనికిరాని సానుభూతి చూపించడం మాని వాళ్ళను అన్ని రకాలుగా ఆదుకుని మానసిక స్థైర్యం ఇవ్వాలి. అంతేగాని ఇలా మనం గర్భంలోనే ఆడ శిశువులను ఏరి పారేస్తుంటే కొన్నాళ్ళకు ఇప్పటికే తక్కువ ఉన్న ఆడ మగ నిష్పత్తి ఇంకా పడిపోయి ఉన్న ఆడపిల్లలకు మరిన్ని ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉంది.

అదీకాక ఇంట్లో పిల్లలను ఆడ, మగ తేడా లేకుండా పెంచడం, ఆడపిల్లలను ఇప్పటి పరిస్థితులకు తగట్టు పెంచడం అంటే వాళ్ళకు స్వీయ రక్షణలో ప్రత్యేక తర్ఫీదునివ్వడం ... ఇలాంటివి అందరూ పాటిస్తే రోజూ వార్తల్లో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు చదివే పరిస్థితులు కలగవు. అందుకని బాగా ఆలోచించుకుని అవసరమనుకుంటే రేపు రండి. లేకపోతే నెల తరువాత తనిఖీకి తీసుకు రండి."

డాక్టరు గారు ఆవేశంగా,ఒకింత ఆవేదనగా చెప్తుంటే నిశ్శబ్దంగా విన్న రత్నావతి కాస్సేపాగి “డాక్టరు గారూ! మీలా చెప్పేవాళ్ళుంటే మాలాంటి వాళ్ళ ఆలోచనలు ఇలా ఉండవు. రాబోయే కాలంలో గడ్డు పరిస్థితి ఎదురవుతుందేమోనని ఆ పరిస్థితి తమకు రాకూడదని ఎవరికి వారు అనుకుంటే జరగబోయేది ఏమిటో మాకు అర్ధమయేటట్లు చెప్పారు. ఇంత విన్నాక కూడా మూర్ఖంగా ఆలోచించలేము. మా చిట్టితల్లిని రెండు చేతులూ చాచి ఆహ్వానిస్తాము. అలాగే ఎలాంటి పరిస్థితులైనా తట్టుకునేటట్లు పెంచుకుంటాము. నెల తరువాత వస్తాము.” చేతులు జోడించి చెప్పింది రత్నావతి. ఆ మాటలు విన్న మహి, ఆకాష్ ల

ముఖాలు      ఆనందంతో వికసించాయి.




నిజం ఎంత నిప్పులాంటిదైనా అబద్దాల జడివానలో ఆరిపోక తప్పదంటారు. బోరుమని ఏడిపించే నిజాలు చెప్పడం కంటే హుషారుపుట్టే అబద్ధాలు చెప్పడమే హెల్త్ కి మంచిదంటారు. అన్నీ పచ్చినిజాలే మాట్లాడ్డం కంటే పండంటి అబద్ధాలే చెప్పడానికి చాలామంది ఉత్సాహం చూపిస్తారు. కానీ ఒట్టేసి చెబుతున్నా కదా! నా నోటంట ఏనాడూ అసత్యం పలికింది లేదు. నిజాలు చెప్పడం మానేస్తానేమో కానీ, అబద్ధాలు మాత్రం చస్తే చెప్పనని ఒట్టేసుకున్నా. మరీ అన్ని సార్లూ కాకపోయినా కొన్ని కొన్నిసార్లు బొంకవచ్చునధిపా అఘము పొందనేరవు అని మభ్యపెట్టే వాక్యాలను ఏనాడూ చెవికెక్కించుకోలేదు నేను.

అలాగని మీరు మరీ ముక్కుసూటిగా మాట్లాడుతారు. మీతో చాలా కష్టం అని ఎవరూ ఇంతవరకూ కంప్లయింటు చెయాలేదు. మీరు భలే లౌక్యులండీ అని ఎవ్వరూ నామీద చురకలెయ్యలేదు. ఆ విధం గా నా నిత్య సత్య వచనా వ్రత దీక్షను ఇన్నేళ్ళనుంచి గుంభనం గా సాగించుకుంటూ వచ్చాను.

కానీ ఆ రోజు మాత్రం నా నియమం సడలించుకోవాల్సి వచ్చింది.

"ఈ మామిడి కాయ పప్పులో వేద్దామనుకుంటున్నా.. మనిద్దరికీ ఎన్ని గ్లాసుల పప్పు పొయ్యాలంటారు?" కాపురానికి వచ్చాక తొలిసారిగా వంటచెయ్యబోతూ అడిగింది మా ఆవిడ.

"నాకేం తెలుసు?" అన్నానేను టీవీలోకి తీక్షణం గా చూస్తూ..

"ఉద్యోగం వచ్చింది మొదలు ఇన్నేళ్ళనుంచి ఇంటికి దూరం గా ఉన్నారు. ఆ మాత్రం పప్పువండడం కూడా నేర్చుకోలేదా?" కొత్తపెళ్ళాం వెక్కిరించింది.

"పప్పు వండితే తప్ప ప్రమోషన్ ఇవ్వమని ఎవ్వరూ అనలేదు" అన్నాను నేను రిమోట్ బలం గా వత్తుతూ

"అడపాదడపా అయినా వంటచేసుకోకుండా ఏ మగాడికైనా తప్పుతుందా? అన్నేళ్ళు బ్యాచిలర్ గిరీ వెలగబెట్టి నేర్చుకున్నది ఇంతేనా" అంటూ మూతి తిప్పుకుంటూ వంటగదిలోకి నిష్క్రమించిందావిడ. పెళ్ళానికి ఆ మాత్రం మాటసాయం చేస్తే పరువు తక్కువా అని మీరంతా నన్ను నిలదీస్తారేమో! మళ్ళీ ఒట్టేసి చెపుతున్నా కదా... అబద్ధం చెప్పాలని నాకు సుతరామూ లేదు. మరెందుకంత శుద్ధాబద్ధం ఆడేశావ్ అంటారా... ఈ ఒక్క విషయం లో మాత్రం అఘము పొందినా సరే , అబద్ధం ఆడక తప్పదని అనుభవపూర్వకం గా నిర్ణయించుకున్నాను. ఆ చరిత్ర కూడా కొంచెంగా చెబుతాను. అనగనగా మా వాడొకడున్నాడు. ఇంక చస్తే అవ్వదేమో అనుకున్న పెళ్ళి వాడిక్కూడా ఎట్టకేలకు అయ్యింది. పువ్వు లాంటి పెళ్ళాన్ని కష్టపెట్టడం ఇష్టంలేక కాదుగానీ, ఆవిడ చేసే వంటలు తినలేక ... తనకి వంట చెయ్యడం బాగా వచ్చు అనే నిజాన్ని బయటపెట్టేశాడు. అప్పట్నుంచి రెండుపూటలా భోజనమే కాదు.. ఫలహారాలు, పిండివంటలూ కూడా వాడి మెడకే చుట్టుకున్నాయ్. "లక్ష రూపాయల జీతగాడివి నీ అదృష్టం ఏమిటిరా ఇలా తిరగబడింది" అంటే వాడన్నాడు కదా..

"ఒక్క నిజం చెబుతాను రాసుకోరా సూరీ! యవ్వనం లో వున్న భార్య చేతకానీ వార్ధక్యం లో వున్న తల్లిచేత గానీ వంటచేయించనేకూడదు. ఈవిడకి చేతకాక, ఆవిడకి కనబడకా ఇద్దరూ తగలేస్తారు" అన్నాడు వేదాంత ధోరణిలో.

"ఏడిశావ్. అందరూ అలాకాదులేరా" అన్నాను నేను.. ఇప్పటికీ చక్కగా వుండే మా నాయనమ్మ వంటకాలను ఊహించుకుని , ఒకసారి లొట్టవేసి. అప్పుడే ఒక నిష్ఠూర సత్యం గ్రహించాను.

మగవాడు తనకు వంటచేతనొచ్చు అని ఎట్టిపరిస్థితిల్లోనూ పెళ్ళాంతో చెప్పరాదు. అధవా చెప్పినా ఏదో ఇంత అన్నం

వుడకెయ్యడం మినహా ఏదీరాదు అని చెప్పవలె. ఒకవేళ ఈ పూటకి తమరు చెయ్యికాల్చుకోవలిసింది అని పెళ్ళాం గారు ఆజ్ఞాపించినట్లాయెనా, మనం వంట చండాలం చెయ్యవలె. వంటగదిని నానాభ్రష్టూ పట్టించవలె.

ఇందుకు అతిక్రమించి చరించను అని గాయత్రి పట్టుకుని నాలో నేను భీషణ ప్రతిగ్న చేసుకున్న తరువాతే పెళ్ళిపీటల మీద నాతిచరామి అన్నాను. అందులో భాగంగానే కేవలం ఇద్దరు మనుషులకు ఎంత పప్పు పడుతుంది అనే చిన్నపాటి జనరల్ నాలెడ్జ్ కొశ్చెన్ కి కూడా ఆన్సర్ చెప్పకుండా నాకు తెలీదు అని ఘోరమైన అబద్ధం ఆడేశాను.

నిజంగా ఎంత పనిచేశాను? ఎల్లప్పుడూ నిజాలే చెపుతాను. అసత్యం ఆడనే ఆడను అన్న నా వ్రతాన్ని సైతం పక్కకు పెట్టేశాను. ఇదంతా తల్చుకుంటే నాకు దుఃఖం పొంగుకొస్తుంది. కంటివెంట ధారగా కారిన కన్నీళ్ళు ముక్కుకి కూడా పని చెప్పాయి. ఒక్కసారి ఎగబీల్చాను.

మాడు వాసన గుప్పుమంటూ కొట్టింది. టీవీ సౌండ్ తగ్గించాను. ఏం చేస్తున్నావ్" అని వంటింటిని ఉద్దేశించి ఒక్క కేక పెట్టాను.

"ఎన్ని నీళ్ళు పోసినా అడుగంటిపోతోంది. పప్పు ఉడికి చావడంలేదు" అంటూ జవాబు పొలికేక వినిపించింది. పెళ్ళితప్పని పాడుబతుకునిచ్చి ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టావురా భగవంతుడా అనుకుంటూ, సోఫాలోంచి లేచి వంటింట్లోకి వెళ్ళాను.

మాడిమంగలం అయిపోతున్న మావిడికాయ పప్పుకేసి శూన్యదృక్కులు ప్రసరించాను. ఆవిరి సెగలకంటే వేడిగా గాఢం గా ఒక్కసారి నిట్టూర్చి అడిగాను.

"ఎంతసేపైంది... ఆ ముక్కలేసి? అని.

"పప్పుతో పాటే వేశానండీ. ముక్కలు చూడండి చక్కగా ఉడికాయ్. ఈ పప్పుమాత్రం ఉడకడంలేదు ఎంచేతంటారు?" సాశ్చర్యంగా నా సహనాన్ని పరీక్షపెడుతున్నట్లుగా అడిగింది తను.

"పుల్లటికాయలు ముందే వేస్తే పప్పు ఉడకదే పిచ్చిదానా... తెచ్చిన రెండు కాయలూ తరిగేశావా? ఏమైనా అట్టేబెట్టావా?" ఆతృతగా అడిగాను.

"బెల్లం వేసి పచ్చడి చేద్దామని ఒక కాయ అట్టేబెట్టానండీ" చెప్పింది బేలగా.

"పచ్చట్లో బెల్లం వేస్తావా? నీ పాకశాస్త్ర జ్ఞానం తగలడ్డట్టే వుంది కానీ, ఆ మామిడికాయ ఇటిచ్చి దయచెయ్" అన్నాను నేను బ్రహ్మచర్యపు రోజులు మళ్ళీ గుర్తుచేసుకుంటూ,

అంతే... ఒక్కసారిగా కుళాయి విప్పిందావిడ. "మొదటిరోజునుంచి మొగుడికి మహా రుచిగా వండేస్తావేమో... అక్కడ్నుంచి అది చెయ్యి ఇది చెయ్యి అని వేపుకుతినేస్తారు జాగ్రత్త అందండీ సుశీల. నేను మాత్రం దాని మాటలు వినలేదు. నిజం .. మీకు చక్కగా వండిపెడదామనే అనుకున్నాను" తనమానాన తాను ఏదో చెప్పుకుంటూ పోతోంది. నా పాటికి నేను ఆరోప్రాణం లాంటి మావిడికాయ పప్పు దీక్షగా చేస్తున్నాను.

చివ్వరిగా నేతిపోపు పెడ్తుంటే ముక్కుతుడుచుకుంటూ అంటుంది కదా.. "ఏవండీ మీకు చక్కగా వండడం వచ్చు కదా! దాచేస్తే దాగిపోతుందా? పెళ్ళాం దగ్గర నిజాలు దాస్తే ఎన్నాళ్ళు దాగుతాయండీ. పోనీలెండీ.. మీకు నచ్చేలా ఎలా వండాలో నాలుగురోజులు చూపించండి. ఆ తర్వాత.. "ఆవిడింకా ఏదో చెబుతూనే వుంది.

అబద్ధం అనే అడుసులో కాలుజారి .. వంటింట్లో పడ్డ నాకు నాలుగుముద్దలు రుచికరమైన పప్పే గొప్ప ఓదార్పునిచ్చింది.




ఒక గ్రామంలో గణపతి అనే చిన్న వ్యవసాయ దారుడు ఉండేవాడు. తన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ వచ్చిన ఫలసాయంతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. ఆ ఏడు పంటలు బాగానే పండి డబ్బులు బాగానే వచ్చినాయి. ఆ డబ్బులతో అతని భార్య ఇంట్లో పాడికోసం ఒక గేదె వుంటే బాగుంటుందని, వెళ్లి గేదెను కొనుక్కు రమ్మన్నది.

గణపతి గేదెను కొనుక్కురావడానికి తమ వూరికి కాస్త దూరంగా వుండే మరో వూళ్ళో పశువుల సంత జరుగుతూ వుంటే వెళ్ళాడు.

గణపతి మంచివాడే కాని ఆశపరుడు. నిజం చెప్పాలంటే కాస్త దురాశా పరుడు. పది రూపాయల సొమ్ము అయిదు రూపాయలకే వస్తే బాగుండు అని ఆలోచించే రకం.

గణపతి మంచి గేదెకోసం సంత అంతా తిరిగాడు. గేదెల దగ్గర గణపతి బేరమాడే విధానం ఇద్దరు మోసగాళ్ళు కనిపెట్టారు. వెంటనే వాళ్ళల్లో ఒకడు తన మాటలతో గణపతికి గాలమేశాడు. 'నా వద్ద చాలా మంచి గేదె వుంది. నీకు చాలా సరసమైన ధరకు ఇప్పిస్తా రా!' అంటూ తనతో తీసుకు పోయాడు. అతను గణపతిని పక్కనే వున్న ఒక చెరువు చెంతకు తీసుకు పోయాడు. దూరంగా చెరువులో పెద్ద కొమ్ములు కనపడే గేదెను చూపించాడు. పైకి కొమ్ములు మాత్రమే కనపడుతున్నాయి. "నీవు చాలా తెలివైన వాడివి కొమ్ములు చూస్తే చాలు ఆ గేదె రకం ఏమిటి ఎన్ని పాలిస్తదో ఇట్టే చెప్పగలవు. నీకు చెప్పేదేముంది బ్రహ్మాండమైన గేదె. చూస్తే మంచివాడిలా వున్నావు. ఇందాకటి నుండి నీ బాధ చూస్తున్నాను. వెళ్తే నా గేదె నీ లాంటి వాడి ఇంటికే వెళ్ళాలి. ఆ గేదె నీదే తీసుకుపో" అన్నాడు. గణపతికి ఆశ కలిగింది. దాని కొమ్ములు చూస్తే బాగానే ఉన్నట్టు కనపడుతోంది. ఒక్కసారి కూడా పైకి

రాలేదేమి? అనుకుంటూ అదే మాట అడగబోయాడు. అది కనిపెట్టినవాడల్లా ఆ మనిషి " చాలా దూరం నుండి కొనుక్కొచ్చాను. ఎండాకాలం కదా! మూడు రోజులు ఎండలో నడిచింది. బాగా సేదదీరాలని నేనే నీళ్ళల్లో విడిచి పెట్టాను. పాపం నీళ్ళల్లోంచి రాలేక పోతోంది."

"ధర ఎంత ?" గణపతి అడిగాడు.

"వాస్తవానికి దాని ధర రెండువేల రూపాయలు పై మాటే. కాని నీకని వేయి రూపాయలకే ఇస్తాను." అన్నాడు వాడు. గణపతికి ఆశ కలిగింది. వాస్తవానికి దాని ధర ఎంత లేదన్నా మూడు నాలుగు వేలు వుంటుంది.

"ఎనిమిది వందల కయితే నేను ఒప్పుకుంటా. నీకు ఇష్ట మైతే దాన్ని ఒడ్డుకు తీసుకు రాపో!" అన్నాడు గణపతి.

"సరే! ఏం జేస్తా! నా అవసరం అలాంటిది. నీవు చాలా తెలివైన వాడివయ్యో! నా అవసరం మీద ఆడుకుంటున్నావు. పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూశావో ఏమో శుభమా అని బంగారం లాంటి గేదెను కారుచవుకగా కొట్టేశావు. మళ్ళీ నా లాంటి దరిద్రుడి చేయి దాని మీద ఎందుకు పడాలి గానీ... నువ్వే వెళ్లి తోలుకు రాపో!" అన్నాడు.

గణపతి ఆ మాటకు పొంగి పోతూ పొద్దున్న తను లేవంగానే తన భార్య మొఖమే చూశాడు. ఆ సంగతి గుర్తుకు తెచ్చుకుంటూ, తనను ఎప్పుడూ తెలివి తక్కువ దద్దమ్మా అని ఎకసక్కేలు ఆడుతుంటుంది. ఇప్పుడు తను ఈ గేదెను తీసుకు వెళ్ళగానే తన భార్య మొఖంలో తిరిగే రంగులు గుర్తుకు వస్తున్నాయి. ఇలా ఆలోచిస్తూ గణపతి గేదెను తోలుకు రావడానికి చెరువులోకి దిగ బోయాడు.

" ఇదిగో పెద్ద మనిషీ!" అన్నాడు వాడు. తనను పెద్దమనిషీ అని సంబోదించగానే గాలిలో తేలిపోయాడు గణపతి. వెనక్కు తిరిగి ఏమిటన్నట్టు చూశాడు. "నేను ఈ మనిషికి అయిదు వందలు ఇవ్వాల. పొద్దున్నుండి నిలబడనిస్తలేడు కూచోనిస్త లేడు. ఓ అయిదు వందలు ముందుగా ఇస్తే వీడి మొఖాన కొడతా!"

గణపతి వెనుకా ముందు ఏమీ ఆలోచించలేదు రొండిన వున్న డబ్బుల సంచిలోంచి అయిదు వందలు లెక్క పెట్టి ఇచ్చి గేదె వైపు కదిలాడు. సగం దూరం పోయాక ఒకసారి వెనుక్కు తిరిగి చూశాడు. గేదెను అమ్మినవాడు నవ్వుతూ చేయి ఊపాడు. గణపతి మరింత ఉత్సాహంగా ముందుకు కదిలాడు. తన గేదె కొమ్ముల వంక చూశాడు. పాపం పిచ్చోడు కొమ్ములకు రంగులు వేయించి

నట్టున్నాడు... నిగనిగ లాడుతున్నై. అనుకుంటూ తన గేదెను చేరుకొని ఒక చేత్తో దాని కొమ్మును పట్టుకొని పలుపుతాడు కోసం వెతక బోయాడు. అంతే! కొమ్ములు చాలా తేలిగ్గా చేతిలోకి వచ్చాయి. అక్కడ చెక్కతో చేసిన రంగేసిన కొమ్ములు తప్ప ఏమీ లేదు. గణపతి హతాశుడయ్యాడు. గిరుక్కున వెనక్కు తిరిగి వొడ్డుకు చూశాడు. వాళ్ళిద్దరూ లేరు.

జరిగిన మోసం అర్థం అయింది. చెప్తా వాళ్ళ పని అనుకుంటూ      కొమ్ములు తీసుకొని ఒడ్డుకు వచ్చి వాళ్ళ కోసం వెతికాడు. వాళ్ళ జాడ లేదు. ఇక చేసేది లేక చక్కగా సంతను నిర్వహించే అధికారి వద్దకు వెళ్లి జరిగింది అంతా వివరించి వాళ్ళ మీద ఫిర్యాదు చేశాడు. "ఏమిటీ! నీవు ఎనిమిది వందలకు గేదెను కొన్నావా? నాలుగు వేలకు తక్కువ గేదెలు ఎక్కడా లేవే. ఎనిమిది వందలకు ఇస్తానంటే ఎలా నమ్మావయ్యా? వాళ్ళెవరో గుర్తించి ఇలా తీసుకురా నేను విచారిస్తా!" అన్నాడు సంత అధికారి. అంతే కాకుండా అక్కడ గుమికూడిన వాళ్ళు తలా ఒక మాట అన్నారు. గణపతికి డబ్బులు పోయినదానికన్నా కూడా ఆ మాటలు చాలా బాధ కలిగించాయి.

మారు మాటాడకుండా అవమాన భారంతో వెనుతిరిగిన గణపతికి వెనుక నుండి సంత అధికారి మాట ఒకటి వినిపించింది. "మోసపోవడానికి మన అమాయకత్వం కన్నా మన దురాశ ఎక్కువ కారణం అనే విషయం ఈ మనుషులు ఎప్పుడు తెలుసుకుంటారో ఏమో!"



అరవైఏళ్ల శ్రీనివాసరావుగారు భార్య వంక చూశాడు. పసిమిఛాయలో, నుదుటన పావలా కాసంత కుంకం బొట్టుతో, ప్రశాంతమైన వదనంతో, ఎఱ్ఱని పట్టుచీరలో అచ్చం కనకదుర్గదేవిలా కళ కళ్లాడిపోతోంది చాముండి.

నిన్ననే షష్టిపూర్తిని వేడుకగా జరిపారు కొడుకు కోడలు, కూతురు అల్లుడు, మనవలు మనమరాండ్రు. అందరూ ప్రవాస భారతీయులే! డబ్బుకేం కొదవలేదు. అందరూ సమయం చేసుకురావడానికి మాత్రం చాముండే కారణం. మానవ సంబంధాలు కుంటుపడకుండా బాధ్యతలు నెరపడంలో మాత్రం తనకి నూటికి నూరు మార్కులెయ్యొచ్చు. కుటుంబంలోని పసిపిల్ల లగాయతు పెద్దల వరకు అందరినీ పూలని కలిపే దారంలా అనుబంధంతో కట్టి ఉంచుతుంది. భార్యను అలా చూస్తున్న కొద్దీ ఆయనలో ఆత్మీయత పెల్లుబికింది.

"చాముండీ, అలసిపోయిన పిల్లలందరూ వాళ్ల వాళ్ల గదుల్లో హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. బాగా పొద్దుపోయింది. చిన్నా చితకా పనులుంటే రేపుచుసుకుందూ..పద అలా డాబా మీదకెళ్దాం. నిండుపున్నమి వెన్నెలని కాసేపు అనుభూతిద్దాం. ఏవంటావు?"అన్నాడు భార్యవంక మురిపెంగా చూస్తూ.

"అలాగేనండీ, కాస్త ఈ సామాను లోపల పడేసి వస్తాను..ఈలోపు మీరు డాబా పైకెక్కి కుర్చోండి"అంది.

శ్రీనివాసరావుగారు డాబాపై వేసి వున్న కుర్చీలో కూర్చుని ఆకాశంలోని నక్షత్రాలనీ, పూర్ణ చంద్రుడిని తదేకంగా చూడసాగాడు.

"అయ్యగారివాల కుర్రవాడైపోయినట్టున్నాడు. చంద్రుడిని తదేకంగా చూస్తున్నారు. భావావేశంతో కవిత్వం చెబుతారేమో"అంది తనొచ్చినట్టుగా తెలియజేస్తూ.

శ్రీనివాసరావుగారు చిన్నగా నవ్వి "చాముండీ, నువ్వు ఎదురుగా ఉంటే ఒక్క కవిత్వమేమిటోయ్, చతుష్షష్టి కళల్లో పరిపూర్ణత్వం వచ్చేస్తుంది. అసలు నిన్నిక్కడికి ఎందుకు రమ్మన్నానో తెలుసా? మగాడి జీవితం నల్లేరుమీద బండి నడకలా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా, సవ్యంగా సాగాలంటే, భార్య సహకారం ఎంతగానో ఉండాలి. చుట్టాలు, పక్కవాళ్లు, స్నేహితులు, మన పిల్లలు అందరితో నువ్వు నెరపిన సత్సంబంధాలు మనకి పెద్దరికమాపాదించి మనమంటే గౌరవం పెంపొందించాయి. మన వైవాహిక జీవితంలో నీకు నూటికి నూరు మార్కులేస్తాను. నువ్వు లేని నా జీవితాన్ని ఊహించుకోలేను. అందుకే కృతజ్ఞతలు చెప్పుకుందామని ఇక్కడికి పిలిచాను."అని ఆవిడ చేయి తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు.

చాముండి భర్త వంక ప్రేమగా చూసి "ఇందులో నా గొప్పతనం ఏమీ లేదండీ, మీ మంచితనమూ కారణమే! మీరు నాకు నూటికి నూరు మార్కులేస్తానంటున్నారు..కాని నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది నన్ను భర్తతో సహా అందరూ కొనియాడేలా పరిపూర్ణ స్త్రీలా మలచిన మా పెద్దమ్మకి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను"అంది.

"మీ పెద్దమ్మా?"

"అవును. ఆవిడ గురించి నేను మననం చేసుకుంటాను. మీరు తెలుసుకుందురుగాని"

***

"అప్పుడు నా వయసు పదమూడేళ్లు..మా ఇంట్లో సత్యనారాయణస్వామి వ్రతానికి వచ్చింది పెద్దమ్మ. ఆవిడపేరు విజయదుర్గ. విజయదశమి నాడు పుట్టిందని ఆ పేరెట్టారట. ఆవిడ ఏ ఇంటికొచ్చినా ఆ ఇల్లు కళ కళ్ళాడేది. అందరికీ తలో పని పురమాయించి, తనూ నాలుగు పనులు చేస్తూ ఇల్లంతా తిరగలిరాయిలా కలయతిరిగేది. ఆవిడంటే పిల్లా పెద్దా అందరికీ అభిమానమే. ఆవిడ ఆహార్యం కూడా పార్వతిదేవిలా చూడంగానే చేతులు జోడించాలనిపించేట్టు ఉండేది.

వ్రతం పూర్తయి ప్రసాదం తిని అందరం మండువాలో కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటుంటే మా అమ్మ"అక్కా, చాముండికి మంచి సంబంధం ఉంటే చూడు, నీ చేతులమీదుగా పెళ్లి జరిపిద్దువుగాని"అంది.

సంభాషణ నా పెళ్లికి సంబంధించినదవడంతో సిగులమొగ్గనై..ఇంట్లోకి తుర్రున పరిగెత్తాను. ఆ తర్వాత ఏం మాట్లాడుకున్నారో నాకు తెలియదు. ఒక రోజు మధ్యాహ్నం భోజనాలయ్యాక నూతి గట్టున కూర్చుని అంట్లు తోముతుంటే మా పెద్దమ్మ వచ్చి "అమ్మడూ..నీ పనయ్యాక నా గదిలోకి రా, నీతో మాట్లాడాలి" అంది.

నేను 'అలాగే' అన్నట్టు తలూపి పనయ్యాక పెద్దమ్మ ఉన్న గదిలోకి వెళ్లాను.

నేను గదిలోకి వెళ్లేసరికి మంచం మీద పెద్దమ్మ నడుం వాల్చి వుంది..కాని నిద్దర పోవడం లేదు. నా కాళ్ల గజ్జెల చప్పుడు విని"రావే అమ్మడూ.."అని కూర్చుంది.

"ఆరోజు నీ పెళ్లి ప్రస్తావన రాగానే సిగ్గుల మొగ్గై భలే పరిగెత్తావే" అంది నా బుగ్గలు పుణికి.

"ఏ కన్నెపిల్లకైనా పెళ్లి అంటే సిగ్గు ముంచుకు వస్తుంది. అది సహజం. పెళ్లి చేసుకోవడానికి వయసు వస్తే సరిపోదు. కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకునుండాలి. పెళ్లంటే అందంగా కనిపించే అడ్డ దిడ్డ దారి. అది ఎప్పుడూ సుగమంగా ఉండదు. వైవాహిక జీవితం సాఫల్యమవాలంటే ఆడా మగా ఇద్దరూ ఎన్నో తెలుసుకునుండాలి. అప్పుడైతేనే అందులోని ఆనందానుభూతి దక్కుతుంది. నీ వ్యక్తిత్వంతో మా అందరి మనసులూ చూరగొన్న నీకు కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలి. అవి కొంతవరకూ ఆచరిస్తే చాలు. ఇవన్నీ పుస్తకాల్లో దొరికేవి కావు. ఎంతో కాలంనుండీ, ఎన్నో జంటల్ని శ్రద్ధగా పరిశీలించగా అనుభవంతో మనసులో ఏర్పడిన అభిప్రాయాలు.

ప్రతి పనికి శిక్షణ అవసరమన్నది తెలిసిందే! శిక్షణతోటే పని సానుకూలమై సత్ఫలితాన్నిస్తుంది. అలాంటిది జీవితంలో ముఖ్యమైన పెళ్లి విషయంలో మాత్రం, అందరూ అదేదో గోప్య కార్యమైనట్టు తూ తూ మంత్రపు పెళ్లిచుపులు, హడావుడిగా పెళ్లి జరిపేస్తారు. ఆడంబరంగా పెళ్లి జరిపించడంలోని శ్రద్ధ, కాబోయే వాళ్లని 'ఎలా అర్ధం చేసుకోవాలి, ఎలా మెలగాలి' అన్నది చెప్పడంలో ఉండదు. ఆడపిల్ల పుట్టింటి వారైతే 'అత్తింటికి, పుట్టింటికి పేరొచ్చేలా ఉండాలి నీ ప్రవర్తన' అని ఒక బానిసకి చెప్పినట్టు చెబుతారే గాని, మానవ సంబంధాలని వికసితం చేసే మంచి మాటలు చెప్పరు గాక చెప్పరు.

స్నేహాన్ని మించిన బంధం పెళ్లి. రెండు మనసులు పెళ్లి పేరుతో ఏకమై జీవితాంతం కలిసుండడం అనేది ఎంత గొప్ప విషయం? మనకంటూ పిల్లలుండడం, వాళ్ల ఆలనా, పాలనా ఎంత అద్భుతం! భార్యాభర్తల మధ్య ఆకర్షణ శక్తి ఎంత బలంగా ఉండాలంటే ఇద్దరిలో ఏ ఒక్కరూ పక్కదారి పట్టకూడదు. ఎప్పుడైనా తగాదాలు, గొడవలు చోటుచేసుకుంటే అవి ఒక స్థాయి వరకు ముచ్చటగా ఉంటాయి. ఫర్వాలేదు. కాని వాటిని తెగేవరకూ లాగి జీవితాన్ని నాశనం చేసుకోవడం మూర్ఖత్వం. మనసా, వాచా కర్మణా ఒకరిలో ఒకరు ఒదిగిపోవడానికే ప్రయత్నించాలి తప్ప ఆభిజాత్యాలతో, ఆధిపత్యధోరణితో బంధాన్ని కాలదన్నుకోకూడదు. ఒకరి వ్యక్తిత్వాన్ని, అభిరుచుల్ని మరొకరు గౌరవించుకోవాలి. విడిపోవడం గొప్పవిషయం కాదు, కలసి ఉండడంలోని కమ్మదనం తెలుసుకోగలగాలి. లోకో భిన్న రుచిహిః అన్నది తెలిసిందే! అందరూ ఒక్కలా ఉండరు. కాబట్టి కొన్ని చోట్ల సర్దుకు పోవాలి..తప్పదు. అయితే ఇవన్నీ ఒక నిర్ణీత స్థాయి వరకే అన్నది మరవకూడదు. గొడవలు సాధారణం నుంచి హింశాత్మకం అవుతుంటే..ఎవరూ ఊరుకోకూడదు. పెద్దవాళ్లకి చెప్పి వాళ్లద్వారా పరిష్కారం ఆలోచించాలి. అవసరమైతే అప్పుడు విడిపోయి మనదైన స్వతంత్ర జీవితం గడపాలి. అయితే అది చిట్టచివరి ప్రయత్నం అన్నది మాత్రం మరచిపోకూడదు. చివరాఖరుగా చెబుతున్నా మన జీవితం మనకి ముఖ్యం. దాన్ని ఎట్టి పరిస్థితుల్లో పాడు చేసుకోకూడదు.

నేను ఈ నాలుగు ముక్కలే నీకు చెప్పలనుకున్నాను. చెప్పేశాను. ఇహ బోలెడంత జీవితం నీ ముందు ఉంది. ఎలా ముందు కెళతావో తెలివైనదానివి నువ్వే ప్రణాళికా బద్ధం చేసుకో. మన జీవితాన్ని ఎలా ఆనందమయం చేసుకోవాలనుకుంటామో, అలాగే వైవాహిక జీవితాన్ని సంపూర్ణం చేసుకోవాలి. మనిషి జీవితంలోని పరిపూర్ణ ఆనందం అనుభవైకవేద్యమయ్యేది అప్పుడే. అదే మన జన్మకి సార్ధకత." అని ముగించింది.

ఆవిడ వంక చూశాను. అచ్చం కూతురికి బాగోగులు చెప్పే అమ్మవారిలా కనిపించింది. వెంటనే కాళ్లకి దణ్ణం పెట్టుకున్నాను. ఆ తల్లి దయే ఈనాటి మీ ప్రశంసలకి నన్ను పాత్రురాలిని చేసింది.

"మీ పెద్దమ్మ నిజంగా దేవత. ఆవిడ మంచి మాటలు, ఆశీస్సులు మనతో పాటూ ఉండబట్టే సునాయాసంగా సంసార సాగరం ఈదాము..ముఖ్యంగా నీ సహకారంతో" అన్నాను మనస్ఫూర్తిగా.




అప్పుడే నిద్ర లోంచి లేచి కూర్చున్నాడు, చలపతి. కంటినిండా నిద్రపోవటం వలన ప్రశాంతంగా ఉంది. లేచి, అటాచ్డ్ రెస్ట్ రూమ్ లోనికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని, పళ్ళూ వళ్ళూ బరబరా తోమేసి, కడిగిన ముత్యంలా బయటికి వచ్చి ఉతికిన లాల్చీ పైజామా వేసుకున్నాడు.

‘హమ్మయ్య, ఆత్మ ఒక శరీరం వదిలి మరో శరీరంలో చేరినట్టు, ప్రతీ రోజు స్నానం చేయగానే మరో జన్మ ఎత్తినట్టు ఉంటుంది…’ హాయిగా నిట్టూర్చి, హాల్లోకి వచ్చాడు. పిల్లలిద్దరూ టీవీలో కార్టూన్స్ పెట్టుకుని, వాటిని చూడకుండా వార్తాపత్రికలతో పాటుగా వచ్చే ఆదివారం అనుబంధాలు చెరోటీ పుచ్చుకుని పజిల్స్ చేసుకుంటున్నారు.

“చంద్రమతీ… ఏం చేస్తున్నావోయ్?” అని పిలుస్తూ వంటగదిలోకి వెళ్ళాడు. మూకుడులో కాగుతున్న నూనె, దానిలో వేగుతూ, పొంగిపోయి తేలుతున్న పూరీ దర్శనమిచ్చాయి… మరోప్రక్క ఆలూ ఉల్లి కూర కొత్తిమీరను అలంకరించుకుని మగ్గుతోంది.

‘ఊ…’ దీర్ఘంగా నిట్టూర్చి, “చంద్రా…ఎక్కడ నువ్వు?” అంటూ కళ్ళజోడు సవరించుకున్నాడు.

“ఆ… ఇక్కడే ఉన్నా… ఇంకా పనిమనిషి రాలేదుగా, మధ్యలో గరిట అవసరమైతేనూ… అయ్యో పూరీ మాడిపోతోంది… జరగండి…జరగండి…” అని చేతులు కడుక్కుని వచ్చి, ఆ పూరీని తీసేసి, మూకుడులో మరో పూరీని వేసింది.

“స్నానం పూర్తైపోయిందా? ఈ రోజు మనం మా కాత్యా పిన్నింటికి వెళ్ళాలి గుర్తుందా? మా బాబాయి పుట్టినరోజు సందర్భంగా మనందరికీ లంచక్కడ… కాఫీ ఇవ్వనా, టిఫిన్ తో పాటుగా తీసుకుంటారా?”

ఆదివారంనాడు ఆటవిడుపు చలపతికి. రోజూ చేసే వాకింగ్ కి ఈరోజు సెలవన్న మాట! హాయిగా ఎనిమిదింటికి లేస్తాడు. ఆఫీసు హడావుడి ఉండదు కాబట్టి ఇంటిల్లిపాదీ కలిసి టిఫిన్ చేస్తారు.

“టిఫిన్ తో పాటే… త్వరగా కానీవోయ్… ఆకలేస్తోంది… ఈలోగా పేపర్లు చదూకుంటా…” అంటూ మళ్ళీ హాల్లోకి వచ్చి పిల్లల పక్కనే కూర్చున్నాడు. “నాన్నారూ, ‘మతి కాని మతి’ ఏమిటి?” పుత్రరత్నం సందేహం…

“అదేరా… అనుమతి…” చెప్పింది పుత్రికామణి.

“అదిగో వస్తోందిగా… చంద్రమతి… మీ అమ్మ…” ముసిముసిగా నవ్వాడు చలపతి.

“నా పేరు మీద సెటైర్లు చాలు పతి దేవా… ఇక రండి…” డైనింగ్ టేబుల్ సర్ది, అందరినీ పిలిచింది.

“పూరీ, ఆలూ కూరనా? అమ్మా, పూరీలోకి హల్వా చేయవచ్చుకదా…” గునిసింది మణి.

“చేసానే తల్లీ… ఇదిగో…” డిష్ లోంచి రవ్వకేసరి తీసి ప్లేట్ లో పెట్టి ఇచ్చింది… మణి ముఖం పున్నమి చంద్రుడిలా విప్పారింది.

“అన్నీ అక్కకేనా… నాకేమీ లేదా?” సణగటం మొదలుపెట్టాడు రత్నాకర్.

“నీకేం కావాలి తండ్రీ?” బుజ్జగించాడు చలపతి.

“నాకు తెలుసులెండి… వాడికి ఏం కావాలో… ఉండు…తెస్తా…” ఫ్రిజ్ తలుపు తెరిచి ఒక బౌల్ పట్టుకు వచ్చింది చంద్రమతి. దాన్నిండా నూజివీడు రసాల జ్యూస్… కుమారరత్నం పూరీతో తింటాడన్న మాట!

“ఊ, అందరికీ అన్నీ ఇస్తావ్… నాకే…” చిన్నగా గొణిగాడు చలపతి.

“ఏంటిటా, మీకేం తక్కువైంది? పూరీలు చేసాను, బంగాళా దుంప కూర చేసాను. చక్కగా తినండి… కావాలంటే ఆ హల్వా, ఈ ఆమ్ రస్ కూడా కలిపి తినండి, బావుంటుంది… ఏం?”

“ఊ…” నిరాసక్తంగా ప్లేట్ ముందుకు లాక్కున్నాడు, చలపతి.

“పతీ… ఏంటమ్మా ఏం కావాలి? అదేనా?”

“ఆ… అదే…ఎర్రగా, గుండ్రంగా, క్రిస్పీగా ఎంత బాగుంటుందో… హు… అనవసరంగా వద్దని అన్నాను ఆరోజు…” బాధగా నిట్టూరుస్తూ మొహం ఎర్రగా చేసుకున్నాడు, చలపతి.

పిల్లలిద్దరూ టిఫిన్ తినగానే చంద్రమతి వాళ్ళ స్కూలు సంగతులు అడుగుతూ వాళ్ళకి బూస్టు కూడా కలిపిచ్చి, ట్యూషన్ కి పంపించేసింది. భర్తకి కాఫీ ఇస్తూ, “అయితే, పెళ్లై పదేళ్ళు దాటేసినా మీ మూడో చపాతీ ఇంకా మీకు దొరకలేదన్న మాట!” అంటూనే కిసుక్కున నవ్వింది.

కినుకగా చూస్తూ కప్పు అందుకుని పేపర్లో తలదూర్చాడు, చలపతి…

పేపర్లో వార్తల బదులుగా పన్నెండేళ్ళనాడు జరిగిన పెళ్లి చూపుల దృశ్యం అతని మనసులో కదలాడసాగింది.

***

“మరీ చిత్రం… ఎవరైనా పెళ్లి చూపులు ఉదయం ఎనిమిదిన్నరకి పెడతారుటండీ?” బుగ్గలు నొక్కుకుంది రాజేశ్వరమ్మ.

“ఆ అబ్బాయికి తల్లిదండ్రులు లేరు కదే… ఉన్న పెద్ద దిక్కల్లా అతని బామ్మ ఒక్కతే… వాళ్ళ సిద్ధాంతిగారు ఈ ఘడియలు బాగున్నాయని చెప్పారట… పాపం ఫోన్ లో రిక్వెస్ట్ చేసింది…పెద్దావిడ… కాదంటే ఏం బాగుంటుంది మరీ… అందుకనే ఉదయం ఫలహారానికి ఆహ్వానించాను ఆ అబ్బాయిని…” తాపీగా చెప్పారు పశుపతి గారు.

“ఎంతైనా పెళ్ళికొడుకు… ఉదయమే ఏం మర్యాదలు చేయాలో ఏమో… ముందుగా తెలిసి ఉంటే మన చంద్రను ఈ రోజు బ్యూటీపార్లర్ కి పంపించే దాన్ని… అయ్యో, అసలే ఇవి మొదటి పెళ్లిచూపులు కూడానూ…” కంగారుగా అందావిడ.

“అవేమీ అక్కరలేదు. ఓ గంట ముందుగా అది మామూలుగా తయారైతే చాలు. సరదాగా ఫ్రెండ్లీ విజిట్ కి వస్తున్నాడు. స్నేహంగా మాట్లాడుకుంటారు. అన్నీ కుదిరితే పెళ్లి… లేకపోతే చిన్న మీటింగ్ అవుతుంది అంతే కదా…”

"ఊ... రాత్రి తొమ్మిదిన్నరకి చెబుతున్నారీ మాట! గారెలు, పూరీలు, చపాతీలు తప్ప ఎమెర్జెన్సీగా ఏమీ చేయలేము కదా... మినప్పప్పు నానబోస్తున్నాను..."

"అలాగే, చపాతీ, ఆలూ కర్రీ కూడా చేయి... స్వీట్స్ తీసుకువచ్చాను... సరిపోతుంది... చంద్రకి చెప్పు..."

అకస్మాత్తుగా మర్నాటి ఉదయమే తనకి పెళ్లి చూపులన్న విషయం తెలియగానే చంద్రకి చాలా కంగారుగా అనిపించింది. కాలేజీకి వెళ్లి చదువుకుంటోంది... ఇంకా ఫైనల్ పరీక్షలు కాలేదు... అతను ఎలా ఉంటాడో, ఎలాంటి వాడో తెలియదు... పెళ్లి పట్ల ఒక అవగాహన కాని, కాబోయే వరుడి పట్ల కలలు కాని లేవింతవరకూ...

ఆరు గంటలకల్లా తయారయింది చంద్రమతి. రాజేశ్వరమ్మ కూడా గారెలు తయారుచేసి హాట్ పాక్స్ లో పెట్టేసింది. చపాతీకి కూర తయారు చేసి, చపాతీ పిండి కలిపి అట్టే పెట్టింది.

సరిగ్గా ఎనిమిది కల్లా వచ్చేసాడు, చలపతి. తాను గవర్నమెంట్ జాబ్ చేస్తున్నానని, సిటీలో ఒంటరిగానే రూమ్ తీసుకుని ఉంటున్నానని, తనకి బామ్మ తప్ప వెనకా ముందూ ఎవరూ లేరని, తనను బామ్మను చక్కగా చూసుకునే అమ్మాయి అయితే చాలని, కానీ కట్నం కూడా తాను ఆశించనని, తల్లిదండ్రులు లేని తనకు కాబోయే అత్తామామలే తల్లిదండ్రులని, పశుపతి గారితో ఎంతో వినయంగా చెప్పాడు. పెద్దల పట్ల అతనికి గల వినయానికి, గౌరవానికి మంత్రముగ్ధులైపోయారు, పశుపతి దంపతులు.

చంద్రమతిని తీసుకు వచ్చి అతని ఎదురుగా కుర్చీలో కూర్చోబెట్టింది, రాజేశ్వరమ్మ. అతని ముఖంలోని సౌమ్యత, కళ్ళల్లోని స్వచ్ఛత ఆమెను ఆకట్టుకున్నాయి... తనకి తెలియకుండానే అతని ఆకర్షణలో పడిపోయింది ఆమె మనసు. ఇద్దరినీ ఏకాంతంగా వదిలేసారు.

కాసేపు మామూలు ప్రశ్నలు అయ్యాక, "మీరు నాకు చాలా నచ్చారు చంద్రా..." అని చెప్పేసాడు, చలపతి... చంద్రమతిని అకస్మాత్తుగా సిగ్గు కమ్మేసింది... "థాంక్ గాడ్!" అనేసింది అప్రయత్నంగా...

విస్మయంగా ఆమె వైపు చూసిన చలపతికి విషయం అర్థమై గలగలా నవ్వేసాడు... "హమ్మయ్య... ఇందాకటి నుంచి మథన పడుతున్నాను... నేను మీకు నచ్చానో లేదో అని..." సిన్సియర్ గా చెప్పాడు...

"సరే, మరి టిఫిన్ తినండిక... కతికితే అతకదు అన్న సామెత మనకి వర్తించదుగా.. అతికేసాక కతకవచ్చు..." నవ్వింది, చంద్రమతి. ప్లేటులో గారెలు చూడగానే, "ప్లీజ్ చంద్రా... నాకు గారెలు సయించవు...వద్దు..." అన్నాడు ముఖం ఇబ్బందిగా పెట్టి.

"ఓ, ఓకే... మరి చపాతీ?"

తలపంకించి, ఆమె ప్లేటులో పెట్టిన రెండు చపాతీలు తినేసరికి అతని కడుపు నిండిపోయింది...

"ఇంకోటి..." మూడో చపాతీ వేయబోయింది అతని ప్లేటులో... చక్కగా నూనెలో వేగిన అంచులు మెరుస్తూ, మధ్య భాగమంతా లేత ఎరుపురంగులో దోరగా కాలిన ఆ చపాతీ ఎంతో టెంప్ట్ చేసింది అతన్ని... కాని, పొట్టలో ఖాళీ లేదు...

"సారీ చంద్రా... నేను ఇంక తినలేను..." అన్నాడు ఎలాగో...

"ఫర్వాలేదు... ఒక్కటే కదా..."

"అమ్మో, వద్దు వద్దు..." అతను గట్టిగా చెప్పటంతో దాన్ని తిరిగి హాట్ పాక్ లోకి వేసేసి, కాఫీ ఇచ్చింది. కాఫీని సిప్ చేస్తున్నా అతని దృష్టి అంతా హాట్ పాక్ లోని చపాతీ మీదనే ఉంది... ఎంత అందంగా ఉంది... టేస్ట్ కూడా భలేగా ఉండి ఉంటుంది... చక్కగా కరకరలాడుతూ... అయ్యో... అనవసరంగా వద్దన్నానా? మనసులోనే తన మొహమాటానికి తనను తాను తిట్టుకున్నాడు, చలపతి.

కాఫీ తాగేసి, లేచాడు చలపతి, 'బామ్మతో ఫోన్ చేయిస్తానంటూ...' అప్పటివరకూ ఎంతో సరదాగా మాట్లాడిన చలపతి కొద్దిగా అన్యమనస్కంగా తయారైనట్టు అనిపించటంతో... "ఎని థింగ్ రాంగ్?" అని అడిగింది చంద్రమతి.

"నో... నాటెటాల్. టిఫిన్ బాగుంది... ఆ మూడో చపాతీ ఉందే, అది మరీను... నీలాగే ఎర్రగా, నోరూరించేలా..." చిలిపిగా అన్నాడు... చంద్రమతి బుగ్గలు ఎర్రబడిపోయాయి.

***

"చపాతీ చేసావా, ఆ మూడో చపాతీలాగానేనా?" ఆశగా అడిగాడు, చలపతి   పెళ్ళయిన ఐదో ఏట ఓ ఆదివారం ఉదయం.

"అబ్బా, అన్ని చపాతీలు అలాగే చేసానండి... మీరేమో రెండు కన్నా ఎక్కువ తినరు..."

"ఉహు, ఏమైనా ఆరోజు ఉదయం నాటి ఆ మూడో చపాతీయే వేరబ్బా... ఇంతకీ ఎవరు తిన్నారు దాన్ని?"

"మూడు వందల ముప్పై మూడో సారి... తమరు అడగటం, నేను చెప్పటం... ఎవరు తిన్నారో గుర్తు లేదండి... ఇదిగో ఈ చపాతీలు చూడండి, అన్నీ ఒకేలా, ఎర్రగా వేగలేదూ?"

"ఉహు... మామూలుగానే ఉన్నాయి... ఆ మూడో చపాతీ వేరు... సరే, రెండు పెట్టివ్వు..."

"ఊ..." నిట్టూర్చింది, చంద్రమతి.

***

'అందమైన బావా... ఆవు పాల కోవా...' సెల్ ఫోన్ పాడటంతో టక్కున ఈలోకంలోకి వచ్చి, ఫోన్ మాట్లాడి చెప్పాడు, చలపతి - "చంద్రా... కాంప్ కి వెళ్ళాలి, బాగ్ సర్దు..."

***

కరెంట్ ఫెయిల్ అయి, చిమ్మచీకటి. రాత్రి పదకొండు దాటిపోయింది. బయట హోరున గాలివాన... గాఢ నిద్రలో ఉన్న చంద్రమతి ఉలిక్కిపడి లేచింది. లిలగా బయట తలుపు కొడుతున్న శబ్దం. సెల్ ఫోన్ లో టార్చ్ వెలిగించి, హాల్లోకి వచ్చి, "ఎవరూ?" అని అడిగింది. "చంద్రా... తలుపు తియ్యి..." భర్త గొంతును గుర్తు పట్టి తలుపు తెరిచింది. వానజల్లుతో పాటే లోపలి వచ్చాడు, చలపతి. మనిషి ముద్దగా తడిసిపోయి ఉన్నాడు. ఎంతో నీరసంగా కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని వచ్చిన భర్తను చూడగానే ప్రాణం నీరైపోయింది చంద్రమతికి.

"అయ్యయ్యో..." అంటూ గబగబా లోపలినుంచి పొడి బట్టలూ, టవలూ తెచ్చిచ్చింది. అతను తడిసిన బట్టలు విడిచి పొడి బట్టలు కట్టుకుని నిస్త్రాణగా సోఫాలో కూలబడ్డాడు. "మీరు రేపు కదా బయలుదేరతానని అన్నారు..." అతని తల తుడుస్తూ అంది చంద్రమతి.

"అలాగే అనుకున్నాను. కానీ రేపు నీ పుట్టినరోజు కదా... సర్ ప్రైజ్ గా ఉంటుందని, పని అయిపోయిందని రేపటికి రిజర్వేషన్ ఉన్నా సరే, బస్ లో బయలుదేరాను. బస్ దారిలో పాడై పోయింది. మరో బస్ వచ్చి మమ్మల్ని ఎక్కించుకుని సగం దూరం వచ్చేసరికి ఈ తుఫాను. రోడ్లన్నీ జలమయం అయిపోయాయి... ఊరవతలే ఆపేసాడు. అక్కడినుంచి ఆటో పట్టుకుని వచ్చేసరికి... ఇంత టైం అయింది. సరే కానీ చంద్రా, నేను లంచ్ కూడా చేయలేదు... అన్నం ఉందా?"

"అయ్యో, లేదండి... అసలు ఇంట్లో బియ్యం కూడా నిండుకున్నాయి... సరే, ఒక్క అయిదు నిమిషాలు ఆగండి..." ఎమెర్జెన్సీ లాంప్ వెలిగించి, వంటింట్లోకి తీసుకు వెళ్ళింది చంద్రమతి. 'ఇంటికి వచ్చేసాను' అన్న నిశ్చింతతో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు, చలపతి.

"అయ్యో, 'ఆకలి ఆకలి' అని అలా పడుకున్నారేమిటి? లేవండి లేవండి..." టీ పాయ్ ని దగ్గరగా లాగి పళ్ళెం పెట్టి, మంచి నీళ్ళ గ్లాసు పెట్టింది చంద్రమతి. పళ్ళెంలో రెండు వేడి వేడి చపాతీలు. పక్కనే ఆవకాయ పచ్చడి...

"సారీ అండీ... తడిపిన పిండి కొద్దిగానే ఉంది ఫ్రిజ్ లో... గబగబా రొట్టెలు చేసి తెచ్చాను... తినండి..."

ఆ చపాతీల పళ్ళెం వళ్ళో పెట్టుకుని గబ గబా తినసాగాడు, చలపతి, "కొత్తావకాయా? అదిరిపోయింది... చపాతీలు భలేగా ఉన్నాయోయ్..." అంటూ...

పళ్ళెంలో చపాతీలు అయిపోయాయి... కాని చలపతి కడుపులో ఆకలి ఇంకా అలాగే ఉంది. సాధారణంగా రెండు చపాతీల కన్నా ఎక్కువ తినడు... కాని ఈ రోజు పరిస్థితి వేరేగా ఉంది... చంద్ర ముఖంలోకి చూసాడు... ఆ చూపులను తప్పించుకుంటూ, "కొద్దిగా పాలున్నాయి, వేడి చేసి తెస్తాను..." అని వంటింట్లోకి వెళ్ళింది. ముఖం ముడుచుకుని కూర్చున్నాడు, చలపతి...

"అరె, కోపమా, ఇటు చూడండి... మీ పళ్ళెంలో..." అటువైపు చూసిన చలపతి ముఖంలో సంభ్రమాశ్చర్యాలు... ఎర్రగా నోరూరించేలా కాలిన, అంచులు వేగిన చపాతీ... ఘుమ్మని నేతి వాసనతో నోరూరిస్తూ... "మీ మూడో చపాతీ...మీ కోసం ప్రత్యేకంగా నెయ్యి వేసి ఎర్రగా కాల్చాను..." ముక్క తుంచి అతని నోటికి అందించింది... ఆమె తినిపిస్తుంటే స్వప్నావశిష్టుడిలా తినేసాడు చలపతి...

"థాంక్ యు చంద్రా... అదే మూడో చపాతీ... మళ్ళీ ఇన్నేళ్ళకు నా పళ్ళెంలోకి వచ్చింది... అదే రంగు... బహుశా అదే రుచి... ఎంత బావుందో నీ ప్రేమలాగానే... నా ఆకలి కూడా తీరిపోయింది... థాంక్ యు చంద్రా..." ప్రేమగా ఆమె నుదుట చుంబించాడు చలపతి...

"రేపటినుండి మూడు చపాతీలు తినండి... 'మిస్సయిన మూడో చపాతీ' అంటూ ఇకపై నన్ను సాధించకండి మరి!" హెచ్చరిస్తూ అతని జుట్టు చెరిపేసింది చంద్రమతి అల్లరిగా...

గడియారం పన్నెండు కొడుతూ ఉంటే ఆమె చేతులు పట్టుకుని గుండ్రంగా తిప్పుతూ, 'హేపీ బర్త్ డే చంద్రా...' అని పాడసాగాడు చలపతి.




" ఝూమ్మంటూ పిజ్జా బాయ్ వెంకట్, ఆర్డర్ చేసిన కేక్ బాక్స్ , పిజ్జా బాక్స్ బైక్ మీద ముందు అటాచ్ చేసిన బాక్స్ లో పెట్టి రివ్వుమంటూ బంజారా హిల్స్ రోడ్ నంబర్ పన్నెండులో ఉన్న పారిశ్రామికవేత్త పాపవినాశం ఇంటికి బయలుదేరాడు.

ఆయన ఇల్లు అక్కడకి పది కిలోమీటర్ల దూరం, అసలు ఆ చుట్టుపక్కలేబోలెడన్ని పిజ్జా హట్లు, బేకరీస్ ఉన్నా ఆయన ఎప్పుడూ ఫేమస్బెంగళూర్ అయ్యంగార్ బేకరీ నుంచే ఆర్డర్ ఇస్తాడు.

సాధారణంగా ఆ ఆర్డర్ వెంకట్ తీసుకువెడతాడు, జస్ట్ అది తీసుకెళ్ళిఇచ్చినందుకే అతనికి టిప్ ఐదువందల నోటు ఇస్తాడాయన.

అందుకే ఆర్డర్ రాగానే హుషారుగా బయలుదేరాడు ఝూమ్మని. బైక్ బయలుదేరగానే కేక్ బాక్స్ లోనుంచి కులాసాగా బయటికి వచ్చి నింపాదిగా బయటికి వచ్చి కులాసాగా ఆ పెట్టె మీదకు చేరిన 'చీమారావ్' విలాసంగా ఒంటి కాలిమీద నిలబడి,దిక్కులు చూడసాగాడు.

ఆహా ఈ ఊరు ఎంత అందంగా ఉందీ, ఏమిటో ఇన్నాళ్ళూ ఆ బేకరీలో కేకులే ప్రపంచం అనుకుని ఎంత సమయం వృధా చేసేసాను... బయట ఇంత పెద్ద ప్రపంచం ఉందని తెలియక, నూతిలో కప్పలా, ఛా ఛా ఇన్నాళ్ళూ ఎంత మంచి లైఫ్ మిస్

అయ్యానూ అనుకుంటూ పరధ్యాహనం గా నిలబడ్డ అతనికి తనకి చిటికెడు దూరంలో నిలబడి తనకేసే ఆరాధనగా చూస్తున్న చిట్టి చిట్టికళ్ళచిచ్చూ కనబడింది... ఇదొకత్తే స్వర్గానికి వెళ్ళినా సవతి పోరన్నట్లు ఇంతటి విశాల ప్రపంచంలోని అందాలని చూద్దామని పుట్టి పెరిగిన బేకరీని వదిలేసి తనవాళ్ళెవరికీ చెప్పకుండా వచ్చేసినా ఈ దరిద్రం ముఖంది తనని వదిలేలా లేదు, విసుగ్గా ముఖం తిప్పుకుని రయ్యిన వస్తున్న గాలి పాటకు దీటుగా తన ఈల పాట మొదలుపెట్టాడు.

ఆ పాటని, చీమారావు స్టైల్ ని పరవశంగా చూస్తూ ఆదమరపుగా నిలబడ్డ చిచ్చూ ఆ గాలివేగానికి కొట్టుకుపోయి ఎలాగో కిందపడకుండా ఆపుకుని, ఆ గడబిడలో మళ్ళీ కేక్ బాక్స్ లో పడిపోయింది బతుకుజీవుడా అనుకుంటూ.

ఇదంతా ఓరకంట గమనిస్తున్న చీమారావ్, క్రింద పడిపోయిందనుకుని ఒక్క క్షణం అయ్యో అనుకున్నా పోనీలే ఈ రకంగా తన పీడా పోయింది, ఇక్కడే ఎక్కడో గంతకు తగ్గ బొంతను చూస్కుంటుంది నన్ను మర్చిపోయి అనుకుంటూ పాట కంటిన్యూ చేసాడు.

బైక్ పాపవినాశం ఇల్లు చేరింది, వెంకట్ ఆ బాక్సు చేతిలోకితీసుకు ఇంట్లో అడుగుపెట్టాడు... ఎందుకైనా మంచిదని లోపలికి దూరిన చీమారావ్ కి అక్కడ వయ్యారంగా పడుకున్న చిచ్చూ ని చూసి వళ్ళు మండిపోయింది ..హూ అంటూ విసురుగా పక్కకి వెళ్ళిపోయాడు.

పాపవినాశం ఇంట్లోంచి పనివాడొచ్చి వెంకట్ చేతికి డబ్బిచ్చి, ఆ బాక్స్ లు తీసికెళ్ళాడు... వాటిని డైనింగ్ టేబుల్ మీద పెట్టి తర్వాత కేక్ బాక్స్ ఒక్కటీ ఫ్రిజ్ లో పెట్టాడు... ముందు హాయిగా చల్లగా అనిపించినా రెండు నిముషాలు గడిచేసరికిచిచ్చూచీమారావ్ గడగడా వణకడం మొదలుపెట్టారు... ఇక తమ చావు పక్కా అనుకున్న చీమారావు కి చిచ్చూ మీద ముందు జాలి తర్వాత ప్రేమా కలగసాగాయి హాయిగా తనవాళ్ళమధ్యకావలసినంత తింటూ హాయిగా ఆనందంగా ఉండాల్సిన చిచ్చూతనవలనేబయటకొచ్చి ఈ ప్రమాదంలో పడింది పాపం అనుకుంటూ చిచ్చూకేసి రాసాగాడు...

"ఏయ్ ఎవరు మీరు? ఇక్కడికెలా వచ్చారు? " పొగరుగా వచ్చిన ప్రశ్నకేసి చూసిన చీమారావు ఒక్కసారిగా అవాక్కయ్యాడు, ఎర్రగా,బుర్రగా అచ్చంగా తన కలల రాణిలా ఉన్న ఆ గొప్పింటిపిల్లకేసి అలా చూస్తూ ఉండిపోయాడు, అంత చలిలోనూ వళ్ళు వేడెక్కిపోయింది...

"నేనూ... నేనూ " మాట తడబడింది

"ఏయ్ ... ఎవరంటే జవాబు చెప్పకుండా ,ఇంతంతకళ్ళేసుకు దయ్యంలా ఆ చూపేంటి? "

దబాయింపుగా అంది.

" చించిం ఎవడో దారినపోయేదానయ్యతో ఆ కబుర్లేంటి? మనమేమిటి? మన అంతస్తేమిటి? కనబడడంలేదూ అదిగో ఆ కేక్ తో బాటు పొరపాటుగా వచ్చేసిఉంటారు అలగా జనం... ఇంట్లో వాళ్ళ కళ్ళబడితే ఆ కేక్ తో బాటే వెళ్ళి చెత్తబుట్టలో పడతారు, చల్వాళ్ళతోమాటలేమిటి? దానిలాగే ఎర్రగా బుర్రగా ఉన్న ఇంకో పెద్దాయనఅన్నాడు, బహుశా ఆ పిల్ల తండ్రి కాబోలు...

" అలాగే నాన్నారూ " గారంగా మెలికలు తిరుగుతూ వెళ్ళిపోయింది ఆ చించిం. చీమారావ్కళ్ళముందు కారు చీకట్లు, మరి మెరుపులాంటి చించింవెళ్ళిపోయిందిగా.

మనసు మార్చుకు ప్రేమగా తనకేసి రాబోయిన చీమారావ్అంతలోకే మనసు మార్చుకుతనకేసిచీదరింపుగా చూడడం తన కళ్ళముందే ఆ కులుకుల రాణిని ఆరాధనగా గొప్పగా చూడడం తట్టుకోలేకపోయింది.

"నువ్వెంతగా వెంటబడినా ఆ గొప్పింటి రాణికి నువ్వు ఆనవు, నీకు అవమానమే తప్ప ఆ పిల్ల దక్కదు, నా మాట విను ఈ గొప్పింటివాళ్ళ సంగతి నీకు తెలియదు, వాళ్ళు మనలాంటి పేదవాళ్ళ నీడ కూడా భరించలేరు... చూసావుగా వాళ్ళ డాబూ,దర్పం, ఇలా ఏ.సిలలో ఉంటారు ... పట్టు పరుపులమీద నిద్రిస్తారు నువ్వు ఆ పిల్లను మరచిపో, ఎలాగైనా ఇక్కడనుంచితప్పించుకుపోదాం,ఇక్కడే ఉంటూ మనకు వాళ్ళలా తప్పుకోవడం, తప్పించుకు తిరగడం తెలియవు.. ఈ ఇంటి మనుషులు మనల్ని చూసారంటే ఏ మందో,మాకో పెట్టి చంపేస్తారు, నన్ను చేసుకోకపోయినా ఫర్వాలేదు నువ్వు క్షేమంగా ఉంటే చాలు." కళ్ళనీళ్ళతో అంది చిచ్చూ. నిర్లక్షంగా ఓ చూపు చూసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు చించిం వైపు.

" ఏంటీ నా వెనక పడ్డావ్? " కవ్వింపుగా అంది చించింఓరగా చూస్తూ ... చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం చూసి.

"నాకు నువ్వు బాగా నచ్చావు,నన్ను పెళ్ళిచేసుకో నిన్ను మహారాణిలా చూసుకుంటాను " ప్రేమగా కళ్ళలోకళ్ళుపెట్టి చూస్తూ అడిగాడు.

ఫకాల్మని నవ్వింది అందమైన తనవంక ఓ సారి గర్వంగా చూసుకుంటూ ...

పెళ్ళా? నిన్నా? నీకు తెలుసా నేను పుట్టిందీపెరిగిందీ ఇక్కడే ... పగలూ రాత్రీ ఏ.సీ గదుల్లో తప్ప ఉండలేను ... ఖరీదైన తిండి తప్ప తినలేను, నీకు తెలుసా రోజూ జీడిపప్పు, బాదాం తిని బతికే నేను నిన్ను చేసుకుంటే,రేషన్ బియ్యం, ఎంగిలి కంచాల దగ్గరా తింటూ బితుకుబితుకూ మంటూ దిక్కుమాలిన బతుకు గడపాలి, అది నా వల్ల కాదు అయినా నేను ఇక్కడే మాతో బాటే ఉంటున్న మాంచిపవర్ఫుల్ కరెంట్ చీమని ప్రేమిస్తున్నా, పెళ్ళి చేసుకు ఇక్కడే సర్వసుఖాలూ అనుభవిస్తూ గడిపేస్తాం ... వెళ్ళు అనవసరంగా వాళ్ళ కంట పడి ప్రాణం మీదకు తెచ్చుకోక చల్లగా ఇక్కడనుంచి జంప్ అయి అదిగో నువ్వంటే పడిచస్తున్న ఆ చలిచీమను చేసుకోపో ... " విసవిసా వెళ్ళిపోయింది.

" అదిగో వాళ్ళెవరో తలుపు తీసి ఆ గిన్నెలు బయటకు తీస్తున్నారు, త్వరగా వాటిమీదకు చేరి ఇక్కడనుంచితప్పించుకుపోదాం రా, పోనీలే నేనంటే ఇష్టం లేని నిన్ను చేసుకు నేను మాత్రం ఏం సుఖపడతాను, ముందు ఇక్కడ నుంచి బయట పడి తరువాత నీకు ఎవరు నచ్చితే వాళ్ళనేచేసుకో ... త్వరగా రా ... అదిగో వాళ్ళు ఆ గిన్నె తీస్తున్నారు, నే పోతున్నా ... నువ్వూ రా " అంటూ తను ఆ గిన్నె మీదకు దూకుతూ, చీమారావుని ఒక్క గుంజు గుంజింది....

"అమ్మయ్యా ... ఆ మంచు కొండల్లోంచి బయట పడ్డాం ... ఇదిగో నే ఈ భవంతిలోంచి బయటకు పోతున్నా ... క్షణం క్షణం భయంతో చస్తూ ఇక్కడ ఉండలేను ... హాయిగా మనతో బాటే ఉంటూ, మనతో బాటే తింటూ ఉండే నా స్థాయి జనం మధ్యకు పోతా ... నువ్వు కూడా అత్యాశకి పోక నీ స్థాయి గమనించుకుని, హాయిగా, సుఖంగా బ్రతుకు... బై బై ... నీ సుఖమే నే కోరుకున్నా, నిను వీడి అందుకే వెడుతున్నా ... " కళ్ళుతుడుచుకుంటూ ఆ ఇంట్లో పని అతని చొక్కా మడతలో దూరిపోయింది ... ఎటూ వాడి పని సమయం అయిపోయాకావాడింటికి వాడు వెడతాడుగా అందుకే ...

మనిషయినా, చీమైనా, దోమైనా తమ తమ స్థాయి మరచిపోతే అన్నీ కష్టాలే మరి అనుకుంటూ. ఇంత జరిగినా తన మీద ఏ మాత్రం కోపం పెట్టుకోక తన సుఖాన్ని, ఆనందాన్ని ఆశించే చిచ్చూ కన్నా ప్రేమించే వాళ్ళు తనకెవరు దొరుకుతారు? మనం ప్రేమించేవాళ్ళకన్నా, మనల్ని ప్రేమించేవాళ్ళని చేసుకుంటేనే తన జీవితం హాయిగా, ఆనందంగా మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతుంది, అవును అదే కరెక్ట్, నేనూ తనతో బాటే, ఇద్దరం హాయిగా ఆనందంగా జీవితాంతం పాలూ-నీళ్ళలా కలిసిమెలసిగడిపేస్తాం ... అనుకుంటూ తను కూడా చటుక్కున అతని చొక్కా మడతల్లో దూరిపోయింది చిచ్చూ వెనకాలే.




కోసలదేశపు మహారాజు ఫణిభూపతికి కళలంటే ప్రాణం. కళాకారులంటే పంచప్రాణాలు. నిండు రాజసభలో వారి కళాకౌశలాన్ని మనసారా ఆస్వాదించి తగురీతిన భూరి బహుమానాలతో సత్కరించేవాడు. అప్పటికే ఆయన ఆస్థానంలో మహా మహా కవులు, కళాకారులు కొలువుతీరారు. నిత్యం వారి ప్రసంగాలతో, సాహిత్యగోష్ఠులతో, కవితాపఠనాలతో, చర్చలతో సభ సకలజనరంజకంగా కళ కళ్లాడేది.

ఇదిలా ఉండగా ఒకనాడు శంకరం అనే పండితుడు "మహారాజా, అందంగా తీర్చిదిద్దిన ఏ పుష్పగుచ్ఛంలోనైనా మరో వర్ణశోభిత, సౌగంధిక, సంపూర్ణ వికసిత పుష్పాన్ని అమరిస్తే అది మరింత పూర్ణత్వాన్ని సంతరించుకుంటుంది తప్ప అనవసరం అనిపించుకోదు. అలాగే సకలకళావల్లభులు, ఉద్దండపండితులు, కవులు, కళాకారులతో మీ సభ ఇప్పటికే నిండుదనాన్ని సంతరించుకుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే మనదేశ శివారు గ్రామమైన దేవరపల్లిలో సుధాముడు అనే కవి ఉన్నాడు. అతడు ఎప్పుడో తప్ప కవిత్వం చెప్పడు. చెప్పాడంటే అది వినుల గుండా ప్రవహించే ఓ రసప్రవాహమే! అంతేకాక ఆ కవితలు కర్తవ్యప్రభోధకంగా ఉండి వినేవాళ్ల మనసుల్ని కట్టిపడేస్తాయి. సుధాముడు మీ కొలువులో ఉంటే సభ మరింత శోభిస్తుంది"అన్నాడు.

మహారాజు వెంటనే తన భటుల్ని పిలిచి ‘రేపటికల్లా సుధాముడిని సకల లాంచనాలతో సభకు తీసుకు రావాలని’ ఆజ్ఞాపించాడు.

మరుసటిరోజు తన ముందు మిక్కిలి వినయంగా నుంచున్న ఆ కవీశ్వరుణ్ని ఆపాదమస్తకం శ్రద్ధగా గమనించాడు. అతనిలోని ప్రతిభ

అద్భుతమైన ప్రకాశంతో ముఖంలో స్పష్టంగా గోచరిస్తోంది.

సుధాముడు చెప్పిన రెండు సందర్భోచిత కవితలు మహారాజు మనసుని ఆహ్లాదపరచడమే కాకుండా, అశేష సభికుల హర్షధ్వనాలు అందుకున్నాయి. అటువంటివి వారు అంతకు ముందు వినలేదు.

రాజు వెంటనే ఆసనం దిగి సుధాముడి దగ్గరకి వెళ్లి గాఢాలింగనం చేసుకుని తన కొలువులో రత్నంలా భాసిల్లమని కోరాడు.

అప్పుడాకవి "మహారాజా, ప్రకృతిని, రమణి రమణీయతను తమ వాక్చాతుర్యంతో కొనియాడడానికి ఇప్పటికే మీ కొలువులో కవులు కొల్లలుగా ఉన్నారు. కాని నేను కవినయింది మరో ఉద్దేశంతో. అవసరం వచ్చినప్పుడు మీ దగ్గరకి వస్తాను. క్షమించి సెలవిప్పించండి"అన్నాడు.

తన అభ్యర్ధనని ఆ కవి తిరస్కరించినందుకు మహారాజుకు చాలా కోపం వచ్చింది. అయినా అది పైకి కనిపించనీయకుండా వెళ్లమన్నట్టుగా తల ఊపాడు.

కొంతకాలం తర్వాత కోసలదేశం మీదకి శతృదేశం యుద్ధం ప్రకటించింది. దాన్ని ఎదుర్కొనే శక్తి ఏ కొశానా లేదు కోసల దేశానికి.

మహారాజు 'తగిన ఆయుధ సంపత్తి, సైనిక శక్తీ లేని తాము యుద్ధాన్ని ఎలా ఎదుర్కోవాలా' అని తన అనుచరగణంతో సమాలోచనలు జరుపుతుండగా వచ్చాడు కవి సుధాముడు.

"మహరాజా, నన్ను మీ కొలువులో చేర్చుకోండి. నా అవసరం ఈ దేశానికి ఇప్పుడు పడింది"అన్నాడు.

'అసలే యుద్ధం హడావుడిలో ఉంటే ఇప్పుడొచ్చి ఈ కవి తన కొలువులో చేరతాననంటాడేమిటి?' మనసులో విసుగ్గా అనుకుని, అదేం పట్టించుకునేంత పెద్ద విషయం కానట్టు తల ఊపి, తన సమ్మతిని తెలిపి, మళ్లీ వ్యూహరచనలో మునిగిపోయాడు.

సుధాముడు మహారాజు కొలువులో కుదిరిపోయాడు.

మరుసటిరోజునుంచి సైనికుల్లో, ప్రజల్లో తన కవితలతో దేశభక్తిని పురిగొల్పాడు. మాతృదేశాన్ని రక్షించుకునే తరుణం ఇదేనని, రక్తం సల సల మరిగేలా పదాలను పేర్చి శత్రువుల గుండెలను చీల్చి చెండాడే మృగరాజుల్లా, మానసికంగా సన్నద్ధులను చేసి ముందుకురికించాడు.

రాజ్యంలోని చిన్నపిల్లాడిని సైతం విల్లంబులు, కత్తులు పట్టుకుని యుద్ధభూమివైపు ఉరకలెత్తించాడు కవి. కవిసైన్యం శత్రుదేశపు సైనికులను కకావికలు చేసింది. కోసలదేశపు పౌరుల దేశభక్తి బలం ముందు శత్రుదేశం వెల తెలబోయింది. యుద్ధంలో విజయం కోసలదేశాన్నే వరించింది. సుధాముడే లేకపోతే యుద్ధంలో గెలుపు సాధ్యమయ్యేదే కాదు. కవిత్వం ఆయుధాల కన్నా పదునైనది, బలమయినదీ అని అప్పుడే మహారాజుకి తెలిసింది. ఇతర కవులు మనసుని రంజింపజేస్తే, సమయానికి వచ్చిన సుధాముడు పౌరుల మనసులో దేశ రక్షణ బాధ్యత పాదుగొలిపి, దేశం పరువు కాపాడాడు, కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేశాడు.

మహారాజు ఆనందబాష్పాలతో ఆ కవి కాళ్లు కడిగాడు.

అన్నాడు. ఆ వెంటనే .. అవతలి కంఠస్వరం గుర్తు పట్టి " హలో . మాధవి . నువ్వా ఈ టైములో ఫోనేంటి ... ? " అన్నాడు.

" ఏవండీ .. ! అబ్బాయికి మర్రిమాను సెంటర్లో యాక్సిడెంటయిందట. యిప్పుడే హాస్పిటల్ నుండి ఫోన్ వచ్చింది. ఆలస్యమైందట. . ! జరగాల్సింది జరిగిపోయిందన్నార్ట డాక్టర్లు. వాడి జేబులోని నెంబర్ ద్వారా ముందే మీకు చేశారట. మీరు ఫోన్ కట్ చేసారట. తర్వాత వాడి సెల్ లోని యింటి నెంబర్ వెతికి నాకు చేశారు.యాక్సిడెంట్ జరిగినప్పుడు... అబ్బాయిని హాస్పిటల్ కి తీసుక వచ్చినతను పోలీసు లకు ఫోన్ కూడా చేశాడట.. అక్కడెవరూ పట్టించుకోలేదట ! " అవతల మాధవి గోల గోలగా యేడుస్తూ చెపుతూంది. వింటున్న వీర భద్రయ్య కి కళ్ళు బైర్లు కమ్మి .. మైండ్ బ్లాకయి పోయి ...

నిలువునా కుప్ప కూలి పోయాడు. *




రాము వయస్సు పదేళ్ళు.   అయినా పాతికేళ్ళ వయసు ఆలోచనలు. తాను వెంటనే పెద్దవాడై పోయి, పెద్ద ఉద్యోగం చేయాలనే కోరిక. తనుకు యిలా ఒక్కో యేడాది పెరు గుతూ పెద్దవాడు కావటం యిష్టం లేదు. ఒకేసారి పాతికేళ్ళు వయసు వాడినవ్వాలంటే యెలా అని పరిపరి విధాల ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చాడు.

కొండకోనల్లో మునులు వుంటారని,   వారు తమ మహిమతో తనని యువకుడిగా మార్చగలని అనుకొన్నాడు. అయితే తాను వారిని ఎక్కడని వెతకాలి,వారి జాడ ఎవరు చెపుతారు అనె బెంగ పట్టు కుంది. తన   కోరికను చెప్పగానే తల్లిదండ్రులు మిత్రులు మందలించి... యిప్పుడు అలాంటి వారెవరూ లేరు.   పిచ్చి పిచ్చి ఆలోచన్లు మానుకొమ్మని సలహా యిచ్చారు. అయినా రాముకి మాత్రం ఆ కోరిక పోలేదు   ఎలాగైనా సాధించాలనే పట్టుదల రోజు రోజుకి పెరగసాగింది.

ఒకరోజు పొద్దున్నే ఎవరికీ చెప్పకుండా అడవి దారి పట్టాడు. దొరికిన కాయో, పండో తింటూ మునుల కోసం పగలంతా వెతుకుతూ రాత్రి కాగానే   యేదో ఒక చెట్టుపై తలదాచుకొనేవాడు. తెల్లారి మళ్ళీ మామూలే. అలా వెతుకు తున్న రాముకి ఒక కుటీరం కనిపించింది. గబగబ అక్కడికెళ్ళి లోపలకు తొంగిచూశాడు. లోపల ఒక ముని దీక్షలో కూర్చొ నున్నాడు.ఆ మునిని చూడగానే రాము సంబర పడిపోయాడు.ఆయన దీక్ష ముగించుకొనే వరకు నిరీక్షిస్తూ బయట నిల్చొన్నాడు.

కాసేపుటికి ముని దీక్ష ముగించుకొని వెలుపలకు వచ్చాడు. బయట నిల్చొన్న చూసి

రాముని నివ్వెర పోయి “ ఎవరివి నాయనా .. యింత దట్టమైన అడవిలోకి ఎందుకు వచ్చావు… ? ” అని అడిగాడు.

రాము వంగి మునికి పాదాభివందనం చేసి “ స్వామి..!మీలాంటి మునులను కలవాలనే ధైర్యం చేసి యిలా అడవిలోకి వచ్చాను. నా అదృష్టం కొద్దీ మీరు కనిపించారు ” అన్నాడు.

“ఎంత సాహసం చేశావు నాయనా… ! కౄరమృగాలు సంచరించే అడవిలోకి యిలా ఒంటరిగా రావటం యెంత ప్రమాదకరం. అయినా మునులతో నీకేమి పని ? ” అని అడిగాడు ముని.

రాము తన మనసులోని కోరిక గురించి చెప్పాడు.

అంతా విన్న ముని నవ్వి, “ యిది మంచి కోరిక కాదు నాయనా .. ! కాలంతో పాటు ఎదగాలే తప్ప ఇలా ప్రకృతి విరుద్ధంగా ఒక్కసారిగా పెద్దవాడు కావాలని కోర కూడదు..” అని చెప్పాడు.

కాని రాము వినిపించుకోక తనని పాతికేళ్ళ కుర్రాడిగా మార్చమని మునిని ప్రాధేయ పడ్డాడు. ముని యెంతగా నచ్చచెప్పినా తన మొండిపట్టు విడవక పోవటంతో కాదనలేక తన తపోబలంతో రాముని పాతికేళ్ళ యువకుడిగా మార్చి వేశాడు.

యువకుడిగా మారిన రాము, ముని వద్ద సెలవు తీసుకొని యింటికి బయలు దేరాడు. మారిన తనని తన వూరిలో యెవరూ గుర్తించ లేదు. అనేక ఆధారాలు చూపి తల్లిదండ్రులను నమ్మించాడు. యువకుడైన రాము వెంటనే చిన్న పాటి వుద్యోగంలో చేరాడు. ప్రతిరోజూ పొద్దున వెళ్ళి సాయంత్రం వచ్చేవాడు.

ఆరోజు సెలవు కావటంతో యింట్లోనే వున్న రాముకి యెదురుగా చెట్టు క్రింద గోళీకాయలు ఆడుతున్న పిల్లలు కనిపించారు. వాళ్ళంతా నిన్న మొన్నటిదాకా తనతో ఆడిన వాళ్ళే … ! తనిప్పుడు వారితో కలసి గోళీ కాయలు ఆడలేడు కదా… ! వారి వైపు దిగాలుగా చూస్తుండి పోయాడు.

రోజులు గడిచే కొద్దీ … తనేమి కోల్పోయాడో అర్థం కాసాగింది రాముకి. తనూ చక్కగా పిల్లలతో వాడు కోవాల్సింది పోయి … యిలా పెద్దరికం తెచ్చుకొని , కోరి కష్టాలలో పడ్డాననే దిగులు మనసులో చోటుచేసుకుంది. తన తోటి వారు కేరింతలు కొట్టుకుంటూ ఆడుకొంటుంటే .. తను బిక్కముఖం వేసుకొని చూస్తున్న రాములో తిరిగి ఆలోచన మొదలైంది. తిరిగి తన బాల్యం తనకు వస్తే బావుండుననే తలపు రావటంతో వెంటనే బయలుదేరి అడవిలోని మునిని కలుసు కున్నాడు.

తిరిగి వచ్చిన రాముని చూడగానే ముని " మళ్ళీ యెందుకొచ్చావ్ … ? " అని అడిగాడు.

" స్వామీ నా కోరిక మన్నించి యువకుడిగా మార్చావు. కాని అలా యువకుడి నైన నేను యేది పోగొట్టుకున్నానో అర్థమైంది.ఎందరు చెప్పినా చివరకు మీరు చెప్పినా వినిపించుకోలేదు. దయచేసి నన్ను మళ్ళీ మామూలు బాలుడిగా మార్చండి . ." అని ముని కాళ్ళ మీద పడ్డాడు.

ముని కోపంగా చూస్తూ .. " యేంటి అంతా నీ యిష్టమేనా … ! నువ్వెలా మార్చమంటే అలా మార్చుతూ నా తపోశక్తిని వృధా చేసుకోవటం నాకు యిష్టం లేదు. చెప్పినా వినక మూర్ఖంగా ప్రవ ర్తించిన నీకు ఈ శాస్తి జరగాల్సిందే .." అన్నాడు.

రాము మునిని వదలక మరీ మరీ బ్రతిమాలి విసిగించడంతో … ఆయను కోపం వచ్చి,

" మూర్ఖుడా ..! చెపితే వినిపించుకోవా ..!యిలా విసిగించావంటే .. నిన్నో కౄరమైన అడవి జంతువుగా మార్చివేస్తా .యిక్కడె పడి వుంటావ్ .. " అన్నాడు.

దిక్కు తోచని రాము వంగి ముని కాళ్ళు పట్టుకున్నాడు. కాళ్ళు పట్టుకున్న రాముని కాలితో బలంగా తోసి " యిదిగో నీకు శాపం తప్పదు .." అంటూ కమండలం చేతికి తీసుకొన్నాడు.

ముని కాలితో తన్నిన తన్ను నిజంగా తగిలినట్లనిపించి వెర్రిగా అరుస్తూ ఉలిక్కి పడి నిద్రలేచాడు రాము. అప్పటికే లేచి కళ్ళాపు చల్లుతున్న వాళ్ళమ్మ పరు గెత్తుకుంటూ వచ్చి " యేమైందిరా అలా వెర్రి కేకేశావు. పీడకల వచ్చిందా .." అని అడిగింది.

ఇంతవరకు జరిగిందా కలా అనుకొని ... “ యేమీ లేదమ్మా..... ! ”      మంచం అంటూ దిగాడు.

అంతే ఆరోజు నుండి తను యువకుడిగా మారాలనే ఆలోచనను పూర్తిగా వదిలేశాడు. బాల్యం లోని అన్ని మధురిమలు ఆస్వాదించాలని నిర్ణయించుకొన్నాడు.*




"చచ్చాన్రో" ..నిశ్శబ్ద      నిశిధిని చీలిస్తూ దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా కేక.

జూబ్లీ చెక్ పోస్ట్ దగ్గర మెరుపు వేగంగా ముందుకురికి వస్తున్న ఓ బైక్ బలంగా ఢీకొనడం తో అంతెత్తున ఎగిరి పక్కనే వున్న రోడ్ డివైడర్ పై పడ్డాడో వ్యక్తి. అతడి తల చిట్లినట్లు పెద్ద శబ్దం. ఆ వెంటనే ధారాపాతంగా స్రవిస్తూ ఎర్రెర్రని రక్తం. హైటెక్ సిటీలో షిఫ్ట్ డ్యూటీ ముగించుకుని క్యాబ్ లో అదే దారిన వస్తున్న చారుమతి ఆ యాక్సిడెంట్ ని చూసి ఒక్కసారి ఖంగు తింది.

"డ్రైవర్ .. కారాపు" రిక్వెస్ట్ చేసింది.

"ఎందుకు మేడం"

"కళ్ళెదురుగా యాక్సిడెంట్ జరిగింది. కనిపించలేదూ" అడిగింది చారుమతి కోపం గా.

"ఈ ఏరియాలో ఇలాంటి యాక్సిడెంట్స్ కామన్ మేడం. నైట్ టైం కదా.. బైక్ రేసింగ్ యమ జోరుగా సాగుతుంటుంది. క్యాబ్ కి ఏ యాక్సిడెంట్ జరక్కుండా మనం ఇంటికెళ్తే అంతే చాలు " అన్నాడు డ్రైవర్ క్యాబ్ స్పీడ్ మరింత పెంచుతూ తాపీగా.

"ప్లీజ్..స్టాప్. క్యాబ్ ఆపలేదనుకో.. ఇంకో యాక్సిడెంట్ అవుతుంది"

"ఎలా"

"డోర్ తెరిచి క్యాబ్ లోంచి నే దూకేస్తాను" గట్టిగా అరిచింది చారుమతి.

"అంత పనిచేయొద్దు మేడం. కారాపుతాను! అంటూనే క్యాబ్ ని రోడ్డు పక్కకు తీసి ఆపాడు డ్రైవర్.

"మీ మంచి కోసమే క్యాబ్ ఆపనన్నాను. అసలే అది యాక్సిడెంట్ ఆపై బైక్ రైడర్స్ అంతా పెద్ద పెద్దోళ్ళ పిల్లలు, పోలీసులే పట్టించుకోని ఈ విషయాలు మనకెందుకని.." డ్రైవర్ ఇంకా ఏదో చెప్తుంటే.. అవేవీ వినకుండా డోర్ తెరిచి క్యాబ్ లోంచి ఒక్క ఊదుటున కిందకు దూకేసింది చారుమతి. యాక్సిడెంట్ కారణం గా అదుపు తప్పి కిందపడ్డ బైక్ ని పైకి లేపి దుస్తులకంటుకున్న దుమ్ముని దులుపుకుంటున్నాడతడు. ఆ తర్వాత బైక్ పై దర్జాగా ఎక్కి కూర్చున్నాడు. క్షణం క్రితం ఆ పరిసరాల్లో అసలేం జరగనట్లుగా వన్ థౌజండ్ సీసీ స్పోర్ట్స్ బైక్ ఫ్రంట్ వీల్ ని అతి లాఘవం గా గాల్లో పైకి లేపి ముందుకురించాడు.

వరెస్ట్ ఫెలో! అరక్షణం లో ఆ బైక్ నంబర్ ను కళ్ళ కెమెరాతో క్లిక్ మనిపించింది. ఆ వెంటనే డివైడర్ దగ్గరికి చేరుకుంది చారుమతి. అరవై ఏళ్ళ వయసున్న ఆ బాధితుడు అప్పటికే స్పృహ తప్పిపోయాడు. డ్రైవర్ ని పిలిచి క్యాబ్ లో ఎక్కించింది. చారుమతి సూచనల మేరకు క్యాబ్ ఆస్పత్రి వైపు వేగంగా దూసుకుపోతుంది.

"ఇప్పుడీ ముసలాడిని ఆస్పత్రికి తీసుకెళ్ళడం అంత అవసరమా మేడం" అడిగాడు డ్రైవర్.

"ఒక్క క్వశ్చన్ కి ఆన్సర్ ఇవ్వు"

"అడగండి"..

ఈ ఆక్సిడెంట్ నీకే జరిగిందనుకో . రక్తం కక్కుంటున్న నిన్ను నాలా ఎవ్వరూ ఆదుకోకుండా ఆ డివైడర్ మీదనే వుంచేస్తే ఏమవుతుంది? అమ్మో .. భయపెట్టకండి మేడం"

"ఎంతసేపూ మనం బతకడమే కాదు.. మరొకరి బతుకుని కూడా మనం పట్టించుకోవాలి. ఇలాంటి ఆపద సమయాల్లో మరీనూ" అంది చారుమతి.

"నిజమే మేడం.. కానీ, యాక్సిడెంట్ అంటే ఎవరికైనా భయమే కదా! పోలీసులు, కేసులు. ఇబ్బందులే"

"ఆ ఇబ్బందులన్నింటికన్నా మనిషి ప్రాణం మరీ విలువైంది. ఆ సంగతి ముందు గ్రహించాలి" అంటుండగానే సెల్ రింగైంది. స్క్రీన్ పై మమ్మీ.. అనే రెండక్షరాలు కనిపిస్తున్నాయి. టైం చూసుకుంది. అర్ధరాత్రి ఒంటిగంట దాటింది. అంటే దార్లో ఈ ఇన్సిడెంట్ జరక్కపోతే అయిదు నిముషాల క్రితమే తను ఇంటికి చేరాల్సింది. అయితే , ఇంకా ఇంటికి రాలేదేమని గాభరాపడుతూ తల్లి కాల్ చేసింది. ఫోన్ ఎత్తి విషయాన్ని క్లుప్తంగా, స్పష్టం గా విశదీకరించి ..మరేం భయపడాల్సిన పని లేదనే భరోసా ఇచ్చి మరో హాఫెనవర్ లో ఇంట్లో వుంటానంటూ కాల్ కట్ చేసింది చారుమతి. అంతలోనే క్యాబ్ ఆస్పత్రికి చేరుకుంది. ముసలోడిని ముందు ఆస్పత్రిలో చేర్చుకోవడానికి డాక్టర్లు నిరాకరించారు. యాక్సిడెంట్ కేసంటూ నానా యాగీ చేసారు. "ఇంతకీ ఈ పేషంట్ కి మీరేమవుతారు?" అడిగాడో సీనియర్ డాక్టర్.

హ్యూమన్ రిలేషన్ ఓ మనిషికి వున్న బంధుత్వం చెప్తూ చారుమతి తన ఐడీ కార్డ్ చూపించింది.

"పోలీసులు, కేసులంటూ చికిత్స చేయకుండా తాత్సారం చేస్తే ఇతడి ప్రాణాలు దక్కవు. ప్లీజ్!" రిక్వెస్ట్ చేసింది.

ఇది కార్పొరేట్ ఆస్పత్రి. చికిత్స ఖర్చులు ఎవరిస్తారు?" క్లారిఫై చేసుకోవడానికి అడిగాడో డాక్టర్."చూసారా, మేడం! వద్దని ఎంత మొరపెట్టుకున్నా దారినపోయిన శనిని నెత్తికెక్కించుకున్నారు. ఈ అనుభవాలే ఎదురవుతాయని ఆ దారినపోయిన ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ఒక్క మీరే మనిషి ప్రాణాలంటూ ఇబ్బందుల్లో ఇరుక్కున్నారు"

క్యాబ్ డ్రైవర్ చూపుల్లో వ్యక్తమయ్యే బావం అది. బాధనిపించింది చారుమతికి.

"మనిషి ప్రాణాలకు విలువలేని సమాజం లో వుంటున్నామా?" సిగ్గనిపించిందామెకు.

"వెంటనే పేషంట్ ని ఏ గాంధీ ఆస్పత్రిలోనో జాయిన్ చేయండి. ప్రాణం పోయేదాకా కనీసం ప్రాధమిక చికిత్సయినా అందుతుంది." ఇంకో డాక్టర్ అనాడామాటల్ని.

ప్లీజ్! అలా మాట్లాడకండి. ఈ పేషంట్ కి అయ్యే వైద్య ఖర్చులకి నేను భరోసా. అడ్వాన్స్ గా ఎంత పే చేయాలో చెప్పండి" అంటూ హ్యాండ్ బ్యాగ్ లోంచి ఏటీఎం కార్డు బయటికి తీసింది చారుమతి.

"ఇంకా ఎందుకు డౌట్ పడుతున్నారు. యాక్సిడెంట్ కేస్ అనేనా మీ భయం. ముందు పేషంట్ ని బతికించండి. ఆ తర్వాత మీకెలాంటి భయాలు లేకుండా నేను చూసుకుంటాను. పోలీస్ కమిషనరేట్ లో మా పెద్దనాన్న డీ ఎస్ పీ గా పనిచేస్తున్నాడు" చెప్పింది.

ఆ తర్వాత సెల్ తీసి రింగ్ చేసి.. ఎవరికో యాక్సిడెంట్ వివరాలందించింది. చారుమతి చేసిన హంగామాకి డాక్టర్లు దార్లోకొచ్చారు. ముసలోడిని ఐసీయూ లోకి తరలించారు. హాఫెనవర్ తర్వాత బయటకొచ్చిన ఓ డాక్టర్ ప్రాణాపాయం లేదని నిర్ధారించిన తర్వాత ఊపిరి పీల్చుకుంది చారుమతి. చికిత్స నిమిత్తం అడ్వాన్స్ గా కొంత సొమ్ము చెల్లిస్తుండగా సెల్ రింగైంది. ఇంటి నుంచే మళ్ళీ కాల్.

"ఏమైందే.. ఎందుకింత ఆలస్యం?" అడుగుతోంది మమ్మీ.

"వచ్చేస్తున్నా... హాఫెనవర్లో" చెప్పి క్యాబ్ లో కూచుంది చారుమతి.

"మీరు డీ ఎస్పీ గారి చుట్టమాండి" అడిగాడు క్యాబ్ ను స్టార్ట్ చేస్తూ డ్రైవర్.

అదెవరు చెప్పారు?

"ఇందాక మీరే .. డాక్టర్లతో చెప్తుంటే విన్నాను"

"ప్రాణవిత్త మానభంగమందు బొంక వచ్చున్న శుక్రనీతి ఆ క్షణం లో గుర్తొచ్చింది" అనుకుంది చారుమతి.

ఆ మర్నాడు..

మళ్ళీ ఆస్పత్రికి చేరుకున్న చారుమతి స్పృహ లోకి వచ్చిన ముసలోడిని పలకరించింది.

"నా ప్రాణం నిలబెట్టిన దేవతవు నువ్వేనా?" కళ్ళలో కృతజ్ఞత ప్రతిఫలిస్తుండగా రెండు చేతుల్తో నమస్కరిస్తూ అడిగాడతడు.

"ఔనూ! అంత రాత్రి వేళ .. ఆ రోడ్డెందుకు దాటావు?" అడిగింది చారుమతి.

"అంతా నా ఖర్మ. రోడ్డుకి ఆ పక్క ఈ పక్క మా పేదోళ్ళ గుడిసెలున్న సంగతి మీకు తెలుసుగా, రోడ్డుకు ఆ పక్క గుడిసెలో కాపురముంటున్న అల్లుడు తాగొచ్చి నా కూతుర్ని తెగ కొడుతుంటే సముదాయించడానికి వెళ్ళి వస్తుండగా యాక్సిడెంట్ జరిగింది" చెప్పాడతడు.

"ఔనా! అంది

ఆ తర్వాత .. ఈ ఆక్సిడెంట్ కి సంబంధించి పోలీస్ కేస్ పెడదాం. ఖాకీ దెబ్బకు దార్లోకొస్తారు. జనాలు తిరిగే రోడ్లపై రేస్ లా? ఆ యాక్సిడెంట్ లో నీ ప్రాణాలే పోతే ఎవరు బాధ్యులు ?" ఆవేశం గా అడిగింది చారుమతి.

"వద్దమ్మా..వద్దు! వాళ్ళంతా బాగా బలిసినోళ్ళు. ఓసారి ఇలాగే యాక్సిడెంట్ జరిగితే... మావోళ్ళంతా తిరగబడ్డారని డబ్బునోళ్ళంతా కూడబలుక్కుని మా గుడిసెలు కాల్చేయబోయారు. అదృష్టవశాత్తూ ఆ రాత్రి భారీ వర్షం పడ్డడం తో ఒక్క గుడిసెకి అగ్గంటుకోలేదు. విషపురుగులకే కాదు.. డబ్బుతో బలిసి కొట్టుకుంటున్న ఈ పెద్దోళ్ళకూ పేదోళ్ళు దూరం గా వుండాల్సిందే" చెప్తున్నాడు ముసలోడు. వాడి కళ్ళల్లో భయం తాండవిస్తోంది."ఇలా క్షణం క్షణం బతికే కన్నా యాక్సిడెంట్ లో చావడమే మేలు" ముందు కోపం గా అనుకున్నా తర్వాత నాలిక్కరుచుకుంది చారుమతి. "కాటేసే పాముల్ని వదిలేసి.. చీమల్ని నిందించడం దారుణం" బాధపడిందామె.

ఫాస్ట్ రేసింగ్ !

బైక్ ని వేగంగా ముందుకురికిస్తూ కొద్ది దూరం వెళ్ళిన తర్వాత ఒక్కసారిగా బైక్ ని పైకి పరిగెత్తించడం. ఒక్కోసారి ముందు టైర్ ని నేలపై వెళ్ళనిస్తూనే .. వెనుక టైర్ ని గాల్లో లేపడం కూడా ఈ రేసింగ్ లో విన్యాసమే.

జిరోకట్.. వున్న చోటే బైక్ ని వృతాకారం లో తిప్పడం. ఎడంకాలిని భూమిపైనే వుంచి యాక్సిలేటర్ ను రైజ్ చేస్తూ బ్రేకులు వేయడం ద్వారా బైక్ ని వృతాకారం లో తిప్పడమే ఈ విన్యాసం ప్రత్యేకత. అంతేనా ! టైంలిమిటెడ్ రేసింగ్ కూడా విశేష ప్రాచుర్యం పొందింది. నిర్ణీత కాలం లో ఎక్కువ దూరం ఎవరు బైక్ పరిగెత్తిస్తారో వారే విజేత.

ట్వెన్టీస్ యూత్ లో ఇటీవల పెరిగిన మోజు బైక్ రేసింగ్      సెలబ్రిటీస్, ఇండస్ట్రియలిస్ట్ లు, పొలిటికల్ లీడర్ల వారసులు బైక్ రేస్ లో పార్టిసిపేట్ చేసేందుకు తెగ ఉత్సాహపడుతున్నారు. దందాలు చేసో, దగాలు అమ్మానాన్నలు అలుపెరగకుండా ట్వంటీ ఫోర్ ఇంటూ సెవన్ సంపాదిస్తుంటే.. వారి వారసులు పందాలు కట్టి మరీ సొమ్ములు ఖర్చు చేస్తున్నారు.

పార్క్ లు, పబ్ లలోనే కాకుండా అర్ధరాత్రి వేళల్లో ప్రాణాలు పణం గా పెట్టి మరీ బైక్, కార్ రేసుల్లో మునిగితేలుతున్నారు.

ఒక్కోసారి జరిగే అనూహ్య ఘటనల్లో ఎన్నటికీ తిరిగిరాలేని దూర తీరాలకు తరలిపోతున్నారు.

ప్రతిరోజూ రాత్రి ఎం ఎన్ సీ కారులో జూబ్లీ చెక్ పోస్ట్ దాటుతుంటే చారుమతికి చటుక్కున గుర్తొచ్చేది బైక్ రేసర్లే.

ఒక్కోసారి తను ప్రయాణిస్తున్న కారును కూడా ఓవర్ టేక్ చేస్తూ బైక్ రేసర్లు ఫ్రంట్ టైర్ గాల్లో లేపి సర్రున దూసుకుపోతుంటే అడ్డం పడి ఆపి మరీ చడామడా తిట్టాలనిపించింది.     "ఒరేయ్.. రోడ్డుపై విన్యాసాలు ప్రాణాంతకమంటూ అరిచి చెప్పాలనిపించేసి. అదుపు తప్పిన రేసర్లు కారును ఢీకొట్టబోతే . ఏ యాక్సిడెంట్ జరక్కుండా డ్రైవర్ తప్పించిన ఘటనలూ అడపాదడపా ఆమెకు ఎదురవుతూనే వున్నాయి.

ఆ రోజు రాత్రి..

జూబ్లీ చెక్ పోస్ట్ దాటి వెళ్తుండగా మళ్ళీ యాక్సిడెంట్ జరిగింది. ఈ సారి బైక్ కింద పడింది ఎవరో అనామకుడైన ముసలోడు కాదు. బైక్ రేసరే వెనుక టైర్ ని గాల్లో లేపి ఫాస్ట్ రేసింగ్ చేస్తున్న రేసర్ బలం గా డివైడర్ ని ఢీకొన్నాడు.

పాతిక లక్షలు ఖరీదు చేసే వన్ థౌజండ్ సీసీ స్పోర్ట్స్ బైక్ అల్లంత దూరానికి ఎగిరిపడింది. నిరవ నిశిధిని చీల్చుకుంటూ .. చచ్చాన్రో! అన్న కేక వెనుకనించి ఎం ఎన్ సీ క్యాబ్ లో వస్తున్న చారుమతి ఆ ఇన్సిడెంట్ ని చూసింది. ఇటీవల ముసలోడిని ఢీకొన్న స్పోర్ట్స్ బైక్ ఇదే. అప్పుడెపుడో కళ్ళ కెమెరాతో క్లిక్ మనిపించిన నంబర్ గుర్తొచ్చింది చారుమతికి. డ్రైవర్ క్యాబ్ ని ఆపగానే హుటాహుటిన డివైడర్ దగ్గరికి చేరుకుందామె.

"ప్లీజ్! సేవ్ మీ!" యువకుడి కళ్ళల్లో వేడికోలు. ఇంతకుముందు ఇదే యువకుడి కళ్ళల్లో     నిర్లక్ష్యం. ఓ యాక్సిడెంట్ చేస్తానన్న భయం కాస్త కూడా లేకుండా.. తన బైక్ కింద ఏ కోడిపిల్లో పడిందన్నంత తేలిగ్గా ఆ ముసలోడిని తన దారిన తాను వదిలేసి వెళ్ళిన ఈ యువకుడి కళ్ళల్లో ఇప్పుడు ప్రాణభయం.

"ప్లీజ్.. మీరెవరో నాకు తెలీదు.. మీ క్యాబ్ లో వెంటనే నన్నాస్పత్రికి తరలించండి. మా ఫాదర్ కి చెప్పి మీరు కోరినంత డబ్బు ఇప్పిస్తాను" అంటున్నాడా యువకుడు. డివైడర్ ఢీకొని అతడి తలకు పెద్ద గాయమే తగిలింది. రక్తం బాగానే పోయింది. అయినా .. తట్టుకోగల వయసతడిది. అందుకే , ఇంకా స్పృహ కోల్పోలేదు.

ప్లీజ్ ! నన్నాదుకోండి. మీకు కావల్సినంత మనీ ఇస్తాను"

ఎంతిస్తావ్ ? చుట్టూ ఎవరూ లేని ఈ అర్ధరాత్రి వేళలో ఎంత సొమ్ముతో నీ ప్రాణాన్ని కొనుక్కుంటావ్?

ఒక లక్ష..

చారుమతి మాట్లాడలేదు. వెన్వంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స చేయించాలని మనసు మారుమూల మూలుగుతున్నా దాని గోడు పట్టించుకోలేదు. ముసలోడి యాక్సిడెంట్ గుర్తొచ్చి అతడికి గట్టిగా బుద్ధి చెపాలనుకుంటోంది. సాధారణ సమయాల్లో ఇలాంటి వాళ్ళకి ప్రాణం విలువ తెలిదు. అందులో పేదోళ్ళ ప్రాణాలు వీళ్ళకళ్ళకి గడ్డిపోచలే. తమదాకా వస్తేనే .. అసలు ప్రాణం విలువ తెలుస్తుంది. అందుకే .. క్యాబ్ డ్రైవర్ ని ఏమాత్రం అప్రమత్తం చేయకుండా కావాలనే ఆలస్యం చేస్తోంది.

"రెండు లక్షలు.. మూడు లక్షలు" క్షణక్షణానికి ఇచ్చే డబ్బు విలువ పెంచేస్తుండా యువకుడు.

"ప్లీజ్... నన్నాదుకోండి. మీకు కావల్సినంత మనీ ఇస్తాను.

ప్లీజ్ ... నన్ను కాపాడండి. ఆస్పత్రిలో నే చేరిన వెంటనే అయిదు లక్షలిప్పిస్తాను" దీనంగా అభ్యర్ధిస్తున్నాడు.

"నీ ప్రాణం విలువ కేవలం అయిదు లక్షలేనా?" చీత్కరించింది చారుమతి.

చూడు ఈ క్షణం లో నా ప్రాణం కాపాడలేదనుకో పొలిటికల్ లీడరైన మా ఫాదర్ తో చెప్పి నీ బతుకు బస్టాండ్ చేస్తా ఉక్రోషం తో ఊగిపోతున్నాడు. రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతున్న తన ప్రాణం కాపాడెందుకు సామధానభేద దండోపాయాల్ని ఆశ్రయిస్తున్నాడు.

"నీకంత సీన్ లేదు. డబ్బుందనే బలుపుతో విర్రవీగుతున్న నువ్వు బతికితే ఎంత? నీ ప్రాణం పాటి విలువ ఆ ముసలోడి ప్రాణం చేయదా?' ప్లీజ్ .. నాకు బుద్ధొచ్చింది. బతికి బట్టకడితే మళ్ళీ బైక్ రేసులంటే రోడ్డుపై విన్యాసాలు చేయను. మనిషి ప్రాణాలు

తీయను .. చేతులు జోడించి అర్ధించాడతడు.

ఆ మాట మీదనే నిలబడు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తా" అంది చారుమతి. జరుగుతున్న సన్నివేశాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న క్యాబ్ డ్రైవర్ ఆ యువకుడికి చేయందించాడు. చారుమతి కూడా తానో చేయివేసి అతడికి అండగా నిలిచింది.

వారం రోజుల తర్వాత..

ఆస్పత్రిలో పరామర్శించడానికి వచ్చిన చారుమతితో ఆ యువకుడన్నాడు. థాంక్స్! ఈ బతుక్కి మీరిచ్చిందే. ఇక ముందు ప్రాణాలతో చెలగాటమాడే విన్యాసాల జోలికి వెళ్ళను.

నువ్వు మారావు. నాకెంతో సంతోషం గా వుంది. అర్ధం చేసుకుంటే నిజానికి జీవితమే సాహస క్రీడ మనల్ని చుట్టుముట్టే వేవేల సమస్యలని చాకచక్యం గా పరిష్కరించుకోవడమంటేనే కత్తులపై నడక, మన ప్రాణానికో , పక్కవాడి ప్రాణానికో ప్రమాదం తెచ్చిపెట్టే సాహసాలు మంచివి కావు. నీలాగే మిగతా రేసర్లూ మారాలి" అంది చారుమతి అతడు వేగంగా కోలుకోవాలని పుష్పగుచ్ఛం ఇస్తూ...